నాలుగవ తిరుమొఴి అవతారిక.

కామదేవార్చన చేసిన ఆండాళ్ కృష్ణుడు గోపకన్యలున్నచోటికి తనంతట తానే వెళ్ళి వాళ్ళతో కలిసిపోయినట్లుగా తనతోకూడా వచ్చి కలుస్తాడని దృఢమైన నమ్మకంతో ఎదురుచూసింది. ఈలోపుగా ఒక సీతాచక్రప్రశ్నం వేసినట్లు తనతో కృష్ణుడువచ్చి కలుస్తాడాలేదా అని కూడలిఴైత్తల్ అనబడే ఒకశకునప్రశ్నం వేసుకున్నది. ఈ తిరుమొఴిలో తాను ఆవిధమైన ప్రశ్నంవేసిందని స్వయంగా చెప్పకుండా గోపికలమీద పెట్టి చెప్పుతున్నది. అంతే తప్ప నిజంగా గోపికలందరూ ఈవిధమైన కూడలిఴైత్తల్‌చేయలేదని ఉత్తమూర్‌స్వామి భావిస్తున్నారు. కూడలిఴైత్తల్‌అంటే అదిఒక ఆటవంటిదే కాని దానివల్ల తాను కోరుకున్న సంశ్లేషం తనకు లభిస్తుందా లేదా అనేదాన్ని తెలుసుకొనటానికి సాధ్యమౌతుందని లోకంలో నమ్మకం. ఇందులో ఒక దోసిలినిండా చిన్నచిన్న శంఖాలుగాని, ముత్యాలుగాని లేదా చిన్న చోడి లేక జొన్నకంకులో, చింతగింజలవంటి విత్తనాలో తీసుకొని వాటిని రెండురెండుగా చేర్చుకుంటూ పోతే చివరకు మిగిలేది ఏమీ లేకుండా అన్నీ జోడీలే అయితే తనతో తనప్రియుడు వచ్చితొందరలో కలుస్తాడనీ, అట్లా కాకుండా ఒకటిగాని మిగిలిపోతే తన కోరిక తీరదనీ ఫలితంగాచెప్పుకుంటారు. లేదా మరొకవిధంగాకూడా దీన్ని జరుపుతారు. ఒక పెద్దచక్రాన్ని వేసి, అందులో ఎన్నో చిన్న చిన్న చక్రాలని గీసి వాటిని కూడా రెండురెండుగా కలుపుకుంటూ పోతే చివరికి మిగిలేది ఏమీ లేకపోతే తాను కోరుకున్నది జరుగుతుందనీ, అట్లా కాక చివరికి ఒకచక్రంగాని మిగిలిపోతే తన కోరిక తీరదనీ భావిస్తారు. ఈ తిరుమొఴిలో కూడిడుకూడలే అనే మకుటంతో అన్ని పాశురాలూ ఉన్నాయి. ఆ కూడిడు కూడలే అన్నప్పుడు కూడల్ - అంటే కలయిక అనేదానికి శంఖాలో, చింతపిక్కలవంటి విత్తనాలో అలాంటి వస్తువు అని అర్థం. కూడలేఅంటే ఓ కలిపేవస్తువా! నీకూడిడు నీవుజతకట్టు అని చెప్పుతున్న దన్నమాట. కూడల్ అన్నదానికి జతకట్టటం అని అర్థమైనా, ఓ జతకట్టటమా! నీవు జతకట్టటంఅనేది జరగాలి అనిచెప్పటమన్నమాట. అచేతనమైనదానిని చేతనమైన దానినిగా భావించిచెప్పటంవల్ల "ఇప్పుడు కూడల్‌అనే జతకట్టును సంబోధించటానికి వెనుక మన్మధుడిని పిలవటానికీ తేడా ఏమీ లేదు. ఈ సంశ్లేషంఎట్లాగ పరమాత్మసంకల్పానికి లోబడే జరుగుతుందో, ఆ మన్మధుడుకూడా అంతర్యామియైన పరమాత్మయొక్కఆజ్ఞకి లోబడే తాను చెయ్యవలసినదానినిచేస్తాడుసుమా"



అని ఇక్కడ చెప్పటం జరుగుతోంది అంటారు ఉత్తమూర్‌వారు.

వెనుకటి తిరుమొఴిలో కృష్ణుడు గోపకన్యల బట్టలని తీసికొనిపోయి కురుంది చెట్టెక్కి ఏవో చిలిపిపనులు చేస్తూ కూర్చున్నాడు. ఈ ఆడపిల్లలు కూడా ఆయనని వెంబడించి "మా బట్టలని ఇచ్చివెయ్యి, మాపట్టుబట్టలని మాకు కటాక్షించు" అంటూ ఎన్నోవిధాలుగా ఆయన తమబట్టలని ఇచ్చితీరక తప్పదని ఒక మాటకి పదిమాటలు మాటాడుతూ ప్రాధేయపడీ, నిందించీ, ఇలాగ నిర్బంధించేరు. దానికి తగినట్లుగా ఏవోప్రార్థనలని చేసేరు. చివరకి ఆయన వాటిని ఇచ్చేడు. దానితో వాళ్ళు బట్టలనిపొందటం, కృష్ణుడు వాటినిచ్చి, గోపకన్యలు వాటిని పొంది, వారికి కృష్ణసంశ్లేషం కలిగింది. సంశ్లేషంలభించినా, అది విశ్లేషంగానే పరిణమిస్తుంది- "సంయోగా విప్రయోగాన్తాః" అని అన్నట్లు సంశ్లేషంఉంటే అది తిరిగి విశ్లేషంగానే పరిణమించి మిగిలేది! లోకంలో ప్రాకృతికభోగాలు నిత్యాలుకావుగదా! అందుచేత సంశ్లేషంకాస్తా విశ్లేషంగా పరిణమించటంతో తిరిగి సంశ్లేషంకోసం గోపికలు ఒక నిరీక్షణంతో ఉండటాన్ని ఈ తిరుమొఴిలో సాయించబడుతోంది. పరమాత్మ వాళ్ళు ఎప్పుడు తననుమాత్రమే కోరుకుంటారా అని ఎదురుచూస్తూఉన్నాడు. ఈగోపకన్యలుమాత్రం బట్టలుకూడా అతనుముట్టుకోవటానికే వల్లకాదంటూచెప్తూ కృష్ణసంశ్లేషాన్ని పోగొట్టుకున్నారు. పరమాత్మ కటాక్షించేకటాక్షంకూడా మనవృత్తాని (నడువడి)కి తగినట్లే ఉంటుంది కదా!

ఇదే ఇతరవిషయలాభం-అలాభాలకంటేకూడా మంచిదికదా! సర్వజ్ఞుడైన పరమాత్మని వదిలి, అచేతనమైన క్రియాకలాపాలతో సరిపెట్టుకొందామనుకున్న వాళ్ళకి విశ్లేషంతోకూడిన సంశ్లేషం అపేక్షితమా అంటే అసలే లాభం లేకపోవటం కంటే ఎంతోకొంతలాభం ఉండటం మంచిదే కదా! ఆయనని పొందటం కోసం కామదేవారాధనంవంటి అచేతనమైన వ్రతాలనాశ్రయిస్తున్నదన్నమాట! వృత్తహీనుడైన కృష్ణుడినిపొందటంకోసం వృత్తవతి(వ్రతాలననుష్ఠించేది)గా ఆయనను పొందటానికిప్రయత్నిస్తున్నదే అంటారు పెరియవాచ్చాన్‌పిళ్ళై. ఇదంతా ఆయనని పొందాలనే ఆతురత, అయినా ఆయనలభించకపోవటం- దీనివల్ల కలిగిన మనోవైకల్యంవల్లనే కలిగింది. ఆవిషయవైలక్షణ్యం అటువంటిదికదా! అది విహితనిషిద్ధ-విచక్షణాజ్ఞానాన్నే చెడగొడుతుందికదా! ఆయననే ఉపాయంగా ఆశ్రయించిన వాళ్ళు అచేతనమైన సంశ్లేషంకోసం పరితపించవచ్చునా? తనని పొందటానికి ఈయనకి కావలసినది ఆకించన్యమే గదా! అందుచేతనే అనన్యసాధ్యుడైనవాడిని

వృత్తహీనుడైన కృష్ణుడన్నారు. ఈమెని వృత్తవతిఅన్నారు. అంటే ఇతరోపాయాలని అనుష్ఠించుతున్నది అని చెప్పటం. ఇక్కడ వృత్తమ్ అంటే నడువడి అని గాని, చక్రం అనిగాని చెప్పవచ్చును.

నాన్ముకన్ తిరువందాదిలో కూడా "అణ్ణప్పన్ తిరువేంగడత్తానై క్కాణ ఇణ్ణప్పన్ తిరుక్కూడల్ కూడ" అని స్వామితో సంశ్లేషాన్ని కోరుతూ సాయించటం ఇక్కడఅనుసంధేయం. భగవత్సంశ్లేషం కావాలని ఉవ్విళ్ళూరటాన్ని చెప్పటంలో ఇది ఒక పద్ధతి అని తెలియజేస్తున్నది.

**మూ.** ***తెళ్ళియార్ పలర్ కైతొழுన్దేవనార్***
***వళ్ళల్ మాలిరుఞ్జోలైమణాళనార్***
***పళ్ళికొళ్ళుమిడత్తు అడికొట్టిడ***
***కొళ్ళుమాకిల్ కూడిడుకూడలే*** *1*

ప్రతిపదార్థం: ***కూడలే***= ఓ సంశ్లేషమా! ***తెళ్ళియార్***= విశదమైన జ్ఞానముగల వారు ***పలర్***= అనేకులు ***కై తొழுమ్***= అంజలిఘటించి నమస్కరించబడు ***తేవనార్***= దేవదేవుడుగను ***వళ్ళల్***= అత్యుదారుడును అగు ***మాలిరుఞ్జోలై***= తిరుమాలింశోలైలో ***మణాళనార్***=వేంచేసియుండు అందగాడైన పెండ్లి కుమారుడును ***పళ్ళికొళ్ళుమ్***= పండుకొనియుండు ***ఇడత్తు***= స్థలమున ***అడి***= (ఆయన)శ్రీపాదములను ***కొట్టిడ***= (నేను)వంగి పట్టుకొని ఉపచారములు చెయ్యగా ***కొళ్ళుమ్ ఆకిల్***= ఆయన నన్ను స్వీకరించినచో ***నీ కూడిడు***= నీవును నీపరివారముతో కలసి చేరి ప్రకాశించుము.

వ్యాఖ్యానం: ఎప్పుడో ఒకసారి తనకి కలిగే సంశ్లేషానికి ఈనాటి నుంచీ సంశ్లేషకారకత్వాన్ని కలిగించేవారికోసం ప్రయత్నించటంతోటే నిత్యానుభవంగలవారిని తలుచుకున్నది. క్షణకాలంకూడా విశ్లేషమనేది లేకుండా స్వామితోటే ఉంటూ నిత్యానుభవాన్ని పొందుతూ, ఎప్పుడూ ఆస్వామికి మంగళాశాసనంచేస్తూండేవారు పరమసాత్త్వికులైన నిత్యసూరులు. వారుకూడా కొంతమందే. పరమాత్మతో కలసిఉండటాన్ని పోగొట్టుకోకుండా



ఎప్పుడూ సంశ్లేషంతోనే జీవిస్తున్నవాళ్ళున్నూ కొంతమందే. విశ్లేషంలో అన్నివిధాలుగానూ నిత్యసంశ్లేషంకలగాలని తెలుసుకొని ఆనిత్యసూరులు ఎంతోమంది అంజలి ఘటిస్తూంటే ఆ అంజలులను స్వీకరిస్తూంటాడు ఆ స్వామి. ఆ నిత్యసూరులు అనుభవించే ఆ అనుభవాన్ని సంసారులకి కూడా కటాక్షించాలని భావించి తిరుమాలిరుంశోలై దివ్యక్షేత్రంలో సన్నిహితుడై వేంచేసియున్నాడు సర్వేశ్వరుడు. శ్రీరంగంలో ఆ స్వామియే పడమరదిక్కుకు తలపెట్టుకొని తూర్పు దిశగా పాదాలుచాచుకొని ఉత్తరంవేపు వీపుతో దక్షిణదిక్కునున్న లంకను చూస్తూ శయనించియున్నాడు. ఓ సంశ్లేషదేవతా! అటువంటి స్థలమైన శ్రీరంగం కోవిలలో ప్రవేశించి ఆస్వామికి శ్రీపాదకైంకర్యం చేసేభాగ్యం ఈనాడు మాకుకలిగించు, ఆవిధంగా సంశ్లేషాన్ని కలిగించగల శక్తి నీకున్నదిసుమా! అని అంటోంది ఆండాళ్. సర్వేశ్వరుడి సన్నిధిని చేరి ఆయనకి అంతరంగకైంకర్యాన్ని చెయ్యగలిగేటట్లు చెయ్యి అని కూడిడు కూడలే అని సంశ్లేషాన్ని ప్రార్థిస్తున్నది అని భావం.

తెళ్ళియార్ పలర్ - తెళివు ఉన్నవారు తెళ్ళియార్. తెళివు అంటే విశదమైన జ్ఞానం. జ్ఞానం సంపూర్ణంగా సాక్షాత్కారమైనప్పుడే అది బాగా విశదమైనది అవుతుంది. అంటే ఉపాయోపేయములు రెండున్నూ ఆ పెరుమాళ్ళేఅనే అధ్యవసాయం. అటువంటి అధ్యవసాయంగలవారు, "కలక్కమిల్లా నల్తవ మునివర్ కరైకణ్డోర్, తుళక్కమిల్లా వానవర్ - కల్తీలేని మంచి తపస్సుచేసిన మునులు ఆవలిగట్టును దర్శించినవారు, తడబాటులేని నిత్యసూరులు" అని సాయించినట్లు, ఆత్మస్వరూపాన్ని కరతలామలకంగా చేసుకున్న సనకాదిమహర్షులున్ను, ముక్తులున్ను, నిత్యసూరులున్ను ఈ తెళ్ళియార్ అనేపదంవల్ల సూచించబడుతున్నారు. కైతొழுమ్- 'బద్ధాంజలి పుటా హృష్టా నమ ఇత్యేవ వాదినః" అని చెప్పినట్లు ఎప్పుడూ చేతులు జోడించుకొనే ఉంటూండేవారేగదా పరమపదంలో ఉండేవారు!. తేవనార్ - 'అపహతపాప్మా దివ్యో దేవ ఏకో నారాయణః" అని చెప్పినట్లు ఆయనే దేవుడు. ఇతరదేవతలకు దేవత్వం సంపూర్ణంగా లేదు. దివ్ అనే ధాతువు లోంచి వచ్చిన పదం దేవః. దివ్అనే ధాతువుకి పదిఅర్థాలున్నాయి. ఇక్కడ

ఉజ్జ్వలమైన వాడు అని అర్థం చెప్పుకోవాలి. "శ్రద్ధయా దేవో దేవత్వమశ్నుతే' అనిచెప్పిన్రపకారం పెరియపిరాట్టితోకలసి ఉండటంచేత ఆయనకి ఆ ఔజ్జ్వల్యం. ఇద్దరూకలిసే సమస్తలోకాలనూనడిపిస్తూ రసింపజేస్తున్నారు. నిత్యులు, ముక్తులు తాము సర్వేశ్వరుడికి అంజలి ఘటిస్తూ తమస్వరూపాన్ని సంపూర్ణంగా తెలియచేసుకొనేటట్లుచేసిన సర్వేశ్వరుడు వారిచేత నమస్కరింపజేసుకొని తాను ఉజ్జ్వలుడై ప్రకాశిస్తున్నాడు. ఇక్కడ మహాభారతం శాంతి పర్వంలోని శ్లోకం అనుసంధేయం. "ముక్తానాం లక్షణం హ్యేతత్ యచ్ఛ్వేత ద్వీపవాసినామ్। నిత్యాంజలిపుటా హృష్టా నమిత్యేవవాదినః॥" ఈవిధంగా అందరుజ్ఞానుల చేతనూ సేవింపబడుతూండే పెరుమాళ్ళు దానితో తృప్తి చెందక, పెరియ పిరాట్టితో చేరియుండడంవల్లకలిగిన దేవత్వానికి (సృష్టి మొదలైన వ్యాపారాలకి) తగినట్లుగా ఇక్కడున్నవారికి కూడా ఉపకారకుడుగా అవటానికి తిరుమాలిరుంశోలైకి వేంచేశేడు.

వళ్ళల్- చాల ఉదారుడైనవాడు. వళ్ళల్ అని వెంటనే మాలిరుఞ్జోలై మణాళనార్ అని చెప్పటంచేత నిత్యవిభూతిలో నిత్యమూ పరమాత్మను అనుభవించే నిత్యసూరులు అనంతకోటిసంఖ్యాకంగా ఉన్నా, వారితో కలసి ఉండటం అనేదాన్ని తలుచుకోకుండా, ఇక్కడున్న సంసారులు పోగొట్టుకొన్న దానిని తలచుకొని పాలిపోయి, ఆనిత్యవిభూతిలో ఉన్న నిత్యానుభవాన్ని ఇక్కడున్నవాళ్ళకికూడా ప్రసాదించాలనేఆశతో తిరుమాలిరుఞ్జోలైదాకా వచ్చి, తనను అనుభవింపచేయటానికి తగినసమయంకోసం ఎదురుచూస్తూ వేంచేసి యున్నాడు స్వామి. "స ఏకాకీ న రమేత"అని మహోపనిషత్తు చెప్పిందికదా! అటువంటి ఔదార్యాన్ని చెప్పినట్లైనదన్నమాట. అంటే తిరుమాలింశోలైలో ఈఔదార్యగుణం ప్రకాశించే విధంగా వేంచేసి ఉన్నాడని వళ్ళల్ అనే పదంతో మనకి సూచితమౌతోంది.

మణాళనార్ - తనని అనుభవించటానికి తగినట్లుగా వచ్చి వేంచేసిన స్థలం. అంటే తానుదర్శనమిచ్చిన స్థలం. గోపికలకోసం యమునానదీ తీరాలలో బృందావనంలో రాత్రినీ, చీకటినీ వెతుకుకొని కాంతిలేనిస్థలంలో కలసినట్లుగా కాకుండా పెరియాழ్వారికుమార్తెను తనగోత్రానికి చెందిన



దానినిగా - అంటేతనకిభార్యగా వివాహంచేసుకొనటానికి వచ్చి వేంచేసి ఉన్నాడట తిరుమాలిరుంశోలై పర్వతంమీద. మణాళన్ అంటే వరుడి అలంకారంతో వచ్చినవాడని అర్థం. ఈవిధంగా తనను ఈయన వివాహం చేసుకొని స్వీకరించాలనే తనకోరికని తెలుపుతోందన్నమాట. అందుకే 'అడికొట్టిడ' అని కేవలదాస్యాన్నిమాత్రం చెప్పలేదు. భర్తయొక్క మహత్తుని, గుణాలనీ చూచి ఈమెకి ఆయనమీద ఉన్న అభినివేశాన్ని చెప్తోందని ఈమె ఈవిధంగా భావిస్తోంది. ఆయన ఏమనుకుంటున్నాడో చూస్తే, తిరుమాలిరుంశోలైలో పెండ్లికుమారుడిగాఉన్న ఆయన పండుకొన్నచోట నాపాదాలనిపట్టి నన్ను స్వీకరిస్తే, కూడిడుకూడలే అనే పాటకి వ్యాఖ్యానం చేసేటట్లవుతుంది. "అంకేనిధాయ కరభోరు! యథాసుఖం తే సంవాహయామి చరణావుత పద్మతామ్రౌ" అని చెప్పిన విధంగా కాముకిస్థితి ఉంటుంది. "తెళ్ళియార్ కైతొழுமడియుళ్ళవన్ తన్ కైయాలెన్ అడి కొట్టిడ క్కూడుకిఱాన్" అని అంటోంది. మరోవిధంగా చెప్పుకోవటం- అందరికీ పిరాట్టి పెరుమాళ్ళను ఏవిధంగా అనుభవించుతున్నదో, ఈ లీలావిభూతిలోఉన్నవాళ్ళుకూడా తనను అనుభవించాలని, ఆశ్రితులకైంకర్యాలనందుకొనటానికి కుతూహలంతో ఎదురు చూస్తూన్న స్థితిని చెప్పుతున్నది. అటువంటి ఎంబెరుమానుడు శయనించి ఉన్నచోటుకు - అంటే శ్రీరంగంకోవిలలో అన్నమాట. ప్రణయిని ముఖం చూపేది సభలోకాదుగదా, పడకమీదే కదా అంటారు పెరియవాచ్చాన్‌బిళ్ళై గారు. "పళ్ళికొళ్ళుమిడమాకిఱతు- కోయిల్" అని భట్టరువారు సాయించటం నేను విన్నానని పిళ్ళై అழకియమణవాళ అరైయర్ చెప్పేవారని వ్యాఖ్యాత శ్రీసూక్తి. అழకనే! అని చెప్పటంలో శ్రీరంగంలో పడుక్కొని ఉండటంవల్ల సుందరుడైన పెండ్లికుమారుడి అలంకారంలో ఉన్నవాడైనాడని భావిస్తోంది అంటారు ఉత్తమూర్‌వారు.

అడికొట్టిడ - మేలుకొని ఉన్నప్పుడు సేవలుచెయ్యటం మాత్రమే కాక, పడుక్కున్నప్పుడుకూడా సంశ్లేషవర్ధకమైన కైంకర్యం చెయ్యటాన్ని చెప్పుతున్నది. అంటే స్వరూపానికి తగిన నడవడితో ప్రవర్తించటాన్ని ఇక్కడ చెప్పుతున్నారు. అడికొట్టిడక్కొళ్ళుమాకిల్ - అనేదానికి మరొకవిధంగా అర్థం

చెప్పవచ్చు- ఎంబెరుమానుడి దృష్టిలో "అన్నివ్వులకమళన్ద వశవేకొల్" అనినీ్న, "నడన్దకాల్‌కళ్ నొన్దవో" అనినీ్న, "అడియారల్లల్ తవిర్త్త అశవో అన్రేలిప్పడితాన్ నీణ్డు తావియవశవో" అనే పాశురాలలో చెప్పినట్లు ఆయన కోసం ఎంతో కష్టపడుతున్నతన శ్రీపాదాలని ఆయనచేతులలో తీసుకొని పరామర్శించి ఆఎంబెరుమానుడు నన్ను అంగీకరించవలెనని. ఆండాళ్ ఆడపిల్లనైనందుకు "ములైయాల్ అణైక్కప్పెఱువేనాకిల్ - ఆయనను బిగి కౌగిలితో బంధించగలిగితే"అని చెప్పవలసిఉండగా "అడికొట్టిడక్కొళ్ళుమాకిల్" అని అనటంచేత స్వరూపానికి తగిన నడవడిలో అన్వయించుకోవాలని ఆశిస్తున్నదని తెలుస్తుంది. భగవత్ప్రాప్తిఫలమేమిటి అంటే ఆయనకి చేసే కైంకర్యప్రాప్తి అనేగదా అర్థం! కొళ్ళుమాకిల్ అని ఆసర్వేశ్వరుడి కటాక్షాన్ని ఎదురుచూడటమేనని సాయించేరుగనుక. "ప్రాప్తిక్కు ఉపాయం అవన్ నినైవే - ప్రాప్తికి ఉపాయం ఆ పరమాత్ముని తలంపే" అని సత్సంప్రదాయార్థం వివరిస్తోంది. మననం ఎన్నివిధాలుగా చేసినా, అవన్నీ చైతన్యకార్యాలుగనే అయి, "ఉన్మనత్తాల్ ఎన్ని నైన్దిరున్దాయ్" అనిచెప్పినట్లు ఆపరమాత్ముని తలుచుకోవటమే ఉపాయమని దృఢమైన నమ్మకంకలిగి ఉండాలి.

కూడిడు కూడలే - అని సంశ్లేషాన్ని కలిగించే ప్రాయోజకత్వాన్ని శరణాగతి చేస్తున్నది. 'ఆయనవల్లనే ప్రాప్తి" అని విశ్వసించి ఉన్నప్పటికీ అచేతనమైన సంశ్లేషాన్నికూడా శరణాగతిచేసేస్థితిలోకి తీసుకువచ్చిందే ఈమెకున్న ప్రాప్యత్వర" అన్న వ్యాఖ్యానశ్రీసూక్తిని గమనించండి. సంశ్లేషాన్ని కలిగించే ప్రయోజకం అనేది అనంగదేవార్చనలాంటి ఎంబెరుమానుడితో ఈమెని చేర్చటంకోసంచేసిన ప్రయత్నం కాదట. అంటే పెరుమాళ్ళతో ఈమె చేరటానికి ఇది కారణంకాదన్నమాట. అయితే, ఆయనతో చేరుతాను అనే నిశ్చయానికీ, తనసంతోషానికీ కారణం ఈకూడల్‌అయింది. శ్రీవచనభూషణం మొదటిప్రకరణంలో "అప్రాప్తవిషయఙ్గళిలే సక్తనానవన్ అతు లభిక్కవేణుమెన్డానిన్డాల్ ప్రాప్తవిషయప్రవణనుక్కు చ్చొల్లవేణ్డావిఱే, అనుష్ఠానముమ్ అననుష్ఠానముమ్ ఉపాయకోటియిల్ అన్వయియాతు. అనన్యోపాయత్వ



ముమ్ అనన్యోపేయత్వముమ్ అనన్యదైవత్వముమ్ కులైయుమ్పడియాన ప్రవృత్తి కాణానిన్డోమిఱే. జ్ఞానవిపరీతకార్యమాన అజ్ఞానత్తాలే వరుమవై యెల్లామ్ అడిక్కఴిఞ్జుపెఱుమ్. ఉపాయ.... ఉపేయాన్తర్భూతమా యిరుక్కుమతు ఉపాయప్రతిబన్ధకమాకాతు అని సాయించిన శ్రీసూక్తులున్ను, వాటికి వ్యాఖ్యానంగా సాయించిన శ్రీసూక్తులున్ను ఇక్కడ అనుసంధేయాలే.

అవతారిక: రెండవ పాశురం- ఆయన నన్ను పొందటానికి సాధనానుష్ఠానం చేసేవాడిలా ఉన్నాడు. ఆఫలం నేను పొందేటట్లు చెయ్యలేదే అంటోంది అంటారు పెరియవాచ్చాన్పిళ్ళై. ఈవిధంగా తనపాదసంవాహనం చేసి తనను పాణిగ్రహణం చెయ్యాలని స్వామి స్వచ్ఛమైన జ్ఞానంగల నిత్యసూరులు, ముక్తులు ఉన్న పరమపదాన్ని వదలి తిరుమాలిరుంశోలైలో ప్రవేశించి పెండ్లికొడుకైనాడు. తిరుమాలిరుంశోలైనీ, శ్రీరంగాన్నీ కలిపి చెప్పినట్లుగా సంశ్లేషాన్ని చెప్పే ఈ తిరుమొழ్షిలో తిరువేంగడాన్నీ, తిరుక్కణ్ణపురాన్నీ కలిపి ఆయన అనుభవించటాన్ని ఎందుకో చెప్తోంది.

*మూ. కాట్టిల్ వేఙ్గడమ్ కణ్ణపురనకర్*
*వాట్టమిన్ఱి మకిழ்న్దు ఉఱైవామనన్*
*ఓట్టరా వన్దెన్ కైపఱ్ఱి త్తన్నొడుమ్*
*కూట్టుమాకిల్ నీ కూడిడుకూడలే.* 2

ప్రతిపదార్థము: **వేఙ్గడమ్ కాట్టిల్**= అడవులలోనున్న తిరువేంగడంలోనున్ను, **కణ్ణపురనకర్**= తిరుక్కణ్ణపురమనే పెద్దపట్టణంలోనున్ను **వాట్టమ్ ఇన్ఱి**=(సంసారుల మధ్యనుంటూకూడా) మనోచాంచల్యంలేకుండా **మకిழ்న్దు**= ఆనందంగా **ఉఱై**= నిత్యవాసం చేసేటటువంటి **వామనన్**= వామనావతారమెత్తిన స్వామి **ఓట్టరా వన్దు**= తానే పరుగుపరుగున వచ్చి **ఎన్ కైపఱ్ఱి** = (నా పాణిగ్రహణము చేసి) చేతులను పట్టుకొని **తన్నొడుమ్**= ఎత్తైన తనశరీరంతో(నా శరీరాన్ని) **కూట్టు మాకిల్**= కౌగలించుకొనినచో **కూడలే**= ఓ సంశ్లేషమా! **నీకూడిడు**= నీవు

చేరుము.

వ్యాఖ్యానం: సర్వేశ్వరుడు నాతో సంశ్లేషించాలని తిరువేంగడం, తిరుక్కణ్ణపురం మొదలైన దివ్యదేశాలలో వేంచేసియున్నాడు. నాకంగీకారమా కాదా అని అనుమానించి ఆలస్యంచేస్తున్నాడులా ఉన్నది. ఆయన నా ఆతురతని బాగా తెలుసుకొని వెంటనే పరుగున వచ్చి నన్ను కౌగలించుకొనేటట్లు చెయ్యాలి అని కోరుకుంటున్నది. శ్రీరామచంద్రుడుగానున్నప్పుడు ఆయన దండకారణ్యం లో ఋషులతో వనవాసరసాన్ని అనుభవించటానికి తగినట్లుగ ఉన్నది తిరుమలలో ఆయన వేంచేసి ఉండటం. ఆతరువాత అయోధ్యలో అందరితోటీ కలిసి ఉండి నగరవాసరసాన్ని అనుభవించినట్లు తిరుక్కణ్ణపురంలోనూ వేంచేసిఉన్నాడు. కృష్ణుడుగా అవతరించినప్పుడు గోకులంలోనూ, బృందావనంలోనూ వేంచేసి ఉన్నాడు. తిరుమలలో వేంచేయటాన్ని బృందావనంలో ఉంటంతోనూ, తిరుక్కణ్ణపురంలో వేంచేసిఉండడాన్ని అయోధ్యానగరవాసంతోనూ పోల్చి చెప్పవచ్చును. నగరవాసానికీ, వనవాసానికీ తేడా లేకుండా రెండింటినీ ప్రీతితోనే అనుభవించగల మనోస్థితిని విభవావతారాల్లో కలిగిఉన్నట్లే అర్చావతారంలోకూడా ఉన్నదని దీనితో చెప్పినట్లైనది.

వాట్టమిల్ మకిళ్ళ్న్దు ఉఱై- "కుఱ్ఱమిత్తేవర్ కుళ్ళాఙ్గళ్ కైతొళ్ళుచ్చోదివెళ్ళృత్తినుళ్ళే ఎఱ్ఱువతోరురు" అని సాయించినట్లు నిత్యసూరుల పరిషత్తులో అత్యుజ్జ్వలంగా వేంచేసి ఉండటాన్ని తప్పించుకొని, మనుష్యగంధంవీస్తున్న ఈ సంసారమండలంలోకి వచ్చి కాననాలు, వానరాలు, వేటగాళ్ళు- వీటన్నిటికీ తన సేవని సాయిస్తూండవలసి వచ్చిందే! అని మనసులో వాట్టమ్ (కొరత)లేకుండా చీకటిగదిలో దీపంలాగ తనకల్యాణగుణాలన్నీ బాగా ప్రకాశించేటట్లు ఇక్కడకి రావటం లభించిందే అన్న అమితమైన మకిళ్ళ్చి(ఆనందం)తో వేంచేసి ఉన్నాడు. ఉఱై - రామకృష్ణాద్యవతారాలు ఒకానొకప్పుడుమాత్రమే అయి, తరువాతివాళ్ళకి ఆ అనుభవం లభించకుండా, తీర్థప్రసాదాలతో పూర్తైపోయి తన పరమపదానికి వేంచేసినట్లు కాకుండా, ఇక్కడ ఈ దివ్యదేశాల్లో అర్చావతారమూర్తిగా ఆనందంగా నిత్యవాసం చేస్తున్నాడు స్వామి. సర్వేశ్వరుడికి కైంకర్యం చేస్తూండటమనే లబ్ధిని పొందటం చేతనులకి కావలసినది గనుక, ఆ పరమాత్మ వేంచేసి ఉండే దివ్యస్థలాలని వెతుకుకొని వెళ్ళవలసినవాళ్ళు చేతనులై ఉండగా, వీళ్ళెక్కడ



ఉన్నారా అని ఆ పరమాత్మే బయలుదేరి వచ్చేటట్లున్న సందర్భం ఏమిటి? అనే సందేహం కలగవచ్చును. కనుక దానికి పరిహారంగా వామనన్ అని సాయిస్తోంది తల్లి. తనసొత్తుని తాను పొందటంకోసమని తాను యాచకుడై అవతరించిన అవతారం వామనావతారం. దానివల్ల చేతనులలాభం ఈశ్వరుడికి పురుషార్థమే తప్ప ఈశ్వరలాభం చేతనుడికి పురుషార్థంకాదు అనే సత్సంప్రదాయార్థం ప్రకాశిస్తోంది అంటారు అణ్ణంగరాచార్యులవారు.

నిత్యవిభూతీ, ప్రకృతి మండలమైన లీలావిభూతీ వేరువేరుగా చాలవని రెంటినీ కలిపి ఆనందంగా అనుభవిస్తున్న ఈ స్వామి, అడివీ, పట్నం వేరువేరుగా చాలవని తిరువేంగడాన్నీ, తిరుక్కణ్ణపురాన్నీ రెంటినీ కలిపి వాటిని హాయిగా అనుభవిస్తు న్నాడు. అలా ఆనందంగా ఉన్నవాడు ఆ సంతోషంతో తన తిరుమేనిని ఉబ్బవేసి త్రివిక్రముడుగా సేవసాయించాలని వామనుడిగా తిరువేంగడంలో ఎందుకు ప్రకాశిస్తున్నాడు? నన్ను పొందలేదనే లోపంతో అని చెప్పుకోవాలి అంటోంది ఆండాళ్‌తల్లి. నాకు అడవుల్లోనూ, పెద్దపట్నాల్లోనూ ప్రవేశించి తిరగటం సాధ్యమా? ఆయనే ఇక్కడికి రావాలి. మహాబలి యజ్ఞానికి ఎలా నడిచివెళ్ళేడో అలాగ అడుగులో అడుగువేస్తూ నెమ్మదిగా రావటానికి తగినసమయమా ఇది? సమయం మించిపోయిందే అని బాధపడుతున్నాను అంచేత ఆయన పరుగుపెట్టుకొని రావాలి. గజేంద్రుడిని రక్షించటానికీ, రుక్మిణీదేవిని పాణిగ్రహణం చేసికొనేందుకూ వెళ్ళినప్పుడు ఉన్న పరుగు ఇప్పుడు కావాలి. పరుగుపరుగున వచ్చి నాచేయి పట్టుకొని నన్ను తనగుండెలమీదికి లాక్కొని కౌగలించుకోవాలి అని ఆశిస్తున్నదన్నమాట.

ఉఱైవామనన్ ఓట్టరా - నిత్యవాసం చేస్తూ ఆనందంగా ఉన్నవాడు అలా ఉండడాన్ని మరి సహించలేక పరుగుపెట్టి వచ్చేలాగ నేనున్నానన్నమాట. ఒకఅడుగు భూమికోసం పరితపించఇపోయినవాడు ఈమెని పొందితే ఇకమరి ఒకలా ఉంటాడా? మూడడుగులభూమిని తీసుకునేందుకు రాక్షసచక్రవర్తి మహాబలిని యాచించటానికి వెళ్ళేడు. యాచించేవాడు ఏలా వెళ్ళేడంటే వాయువేగాన్ని మించినవేగంతో పరుగుపెట్టి వెళ్ళేడని చెప్తారు. ఆ భూమికంతటికీ అభిమానిదేవత భూదేవియైన ఆండాళ్‌ను పొందటానికి భూసురశ్రేష్ఠుడైన పెరియాళ్వారిదగ్గరకువచ్చి అడగటానికి ఆయన పరుగుపెట్టి ఎందుకురాకూడదు? అక్కడైతే తనుకోరినది లభిస్తుందా అనే సందేహానికి తావుండెను. ఇక్కడ అలాంటి

సందేహానికి అవకాశమే లేదే! ఆలస్యం చెయ్యకుండా రావచ్చునుగదా! ఓట్టరా - ఓట్టమ్ తరా - వేగాన్ని ఇచ్చి. తనతో వచ్చే గరుత్మంతుడు మొదలైనవారికికూడా తానే వేగాన్నిచ్చి అని చెప్పటానికి తగిఉన్నది.

"ఓట్టరావన్దు ఎన్నై ప్పుగ్రుప్రవానాకిల్" అన్నదాంట్లో ఒక స్వారస్యం ఉందంటారు అణ్ణంగరాచార్యులవారు. "ఓట్టరావన్దు ఎన్నై తన్నొడుక్కూట్టుమాకిల్" అని అనకుండా "ఎన్కైప్పుగ్రుత్తన్నొడుక్కూట్టుమాకిల్" అని చెప్పటంలో "అజ్జణనుణ్డ వెన్నారుయిర క్కోతితు" అని సాయించినట్లు పట్టినపట్టులో (అనన్యార్హ అయేటట్లు పట్టుకోవాలి ఆ హస్తస్పర్శవల్ల) నేను స్తబ్ధురాలినై నిలచిఉండగా నన్ను లాగుకొని కౌగలించుకొని తనవక్ష స్థలంమీదికి లాగుకోవాలి అని చెప్తున్నదంటారు

కైప్పగ్రి అని పాణిగ్రహణం అనే వివాహాన్ని. తన్నొడుమ్ కూట్టుమాకిల్ - అని శ్రీవిల్లిపుత్తూరిలో వివాహం జరిపించటానికి వయస్సు రాగానే తనని పిలచి ఆయనతో చేరటాన్నీ చెప్పినదని చెప్పవచ్చు. తన్నొడు + ఉమ్ అని ఆ ఉమ్ అనటంవల్ల ఆయన గొప్పతనాన్నీ, ఎన్ అని ఈమెయొక్క తక్కువతనాన్నీ చెప్తోంది. వామనుడు తన బ్రహ్మచర్యంలోనే నన్ను వదలకుండా తనతోటే ఉంచుకున్నాడే అని చెప్పినట్లుగా కూడ చెప్పుకోవచ్చును.

"కూట్టుమాకిల్ నీ కూడిడు కూడలే" అంటే, "ఆయన వేంచేసి నన్ను తనతో చేర్చుకొనేటట్లు నీవు అనుకూలించవలెను" అని అర్థం అన్నమాట. ఆయనలో దోషం లేదు, నీప్రక్కనించి అంగీకారమే కావాలి అని సంశ్లేషాధిదేవతని ప్రార్థిస్తోందన్నమాట. 2

అవతారిక: మూడవ పాశురం. ఇకమీదట కణ్ణపురనగరానికి తగినట్లుగా ఆరుపాశురాలలో కృష్ణుడి వృత్తాంతాన్ని చెప్తూ ఆయనతో తనకి సంశ్లేషాన్ని కలిగించాలని సంశ్లేషాధిదేవతని వేడుకొంటోంది.

**మూ. పూమకన్ పుకழ் వానవర్ పోఱ్ఱుతఱ్కు**
**ఆమకనణివాణుతల్ తేవకి**
**మామకన్ మికుశీర్ వసుతేవర్తమ్**
**కోమకన్వరిల్ కూడిడుకూడలే 3**



ప్రతిపదార్థం: **పూమకన్**= ఎంబెరుమానుడి నాభికమలంలో జన్మించిన బ్రహ్మ, **పుకழ్ వానవర్**= (అతనివలెనే) కీర్తించబడే నిత్యసూరులున్నూ **పోఱ్ఱుతఱ్కు ఆమ్**= స్తుతించటానికి తగినవాడైన **మకన్**= పురుషుడైనవాడును **అణి**= అందమైనదిన్నీ **వాణ్**= ప్రకాశిస్తున్నట్టిదిన్ని అయిన **నుతల్**= నుదురుగల **తేవకి**= దేవకీదేవియొక్క **మామకన్**= గొప్పవాడైన కుమారుడున్ను **మికుశీర్**= చాలమంచిగుణములుగల **వసుతేవర్తమ్**= వసుదేవులకు **కోమకన్**= నాయకుడైన కృష్ణుడు**వరిల్**= నావద్దకు వచ్చి సంశ్లేషించేటట్లు **కూడలే**= ఓ సంశ్లేషాధిదేవతా **కూడిడు**= నీవు ఏర్పాటు చేయవలెను.

వ్యాఖ్యానము: (మూడవ పాశురం) చతుర్ముఖుడూ, నిత్యసూరులూ స్తుతించేటట్లు అక్కడ ఆయన వేంచేసి, తరువాత దేవతల కోరికని అంగీకరించి భూభారాన్ని తగ్గించటంకోసం మధురానగరంలో వేంచేసి దేవకీదేవి వసుదేవులకి "పుతల్వన్" అయి అవతరించిన సర్వేశ్వరుడు ఈనాడు నా దుఃఖం తీరేటట్లు ఇక్కడ వేంచేసి ఉండవచ్చునే అని కోరుకుంటున్నది.

"బ్రహ్మ,నిత్యసూరులువీళ్ళందరూ కీర్తించటానికి వేంచేసిన కుమారుడు" అని ప్రయోగించబడింది. లేక, కీర్తి అనేదాన్ని నిత్యసూరులకి విశేషణంచేసి "తద్విప్రాసో విపన్యవో జాగృవాంస స్సమిన్ధతే" అనిన్నీ, "యత్రర్షయః ప్రథమజా యే పురాణాః" అనిన్నీ శ్రుతివాక్యాలచేత కీర్తించబడిన నిత్యసూరులు అని అర్థం చెప్పుకోవచ్చును. పూమకన్ అన్నది ఉపలక్షణమై, ఈవిభూతిని చెప్పి, పుకழ்వానవర్ - కీర్తించబడిన నిత్యసూరులు అని ఆవిభూతిని చెప్పినట్లై ఒక నదీమధ్యంలో ప్రయాణిస్తున్న ఓడని రెండుతీరాలమీదనున్నవారున్నూ పిలుస్తున్నట్టు రెండువిభూతుల్లోనూ ఉన్నవారిచేత స్తుతించబడినవాడు అని చెప్పవచ్చును. "నావేవ యాన్తముభచే హవన్తే" అన్న తైత్తిరీయ సంహితలోని వాక్యం ఇక్కడ స్మరించతగినది. "పోఱ్ఱుతఱ్కా మవన్" అని ప్రాచీనపాఠం అని అంటారు కొందరు. అప్పుడు ఆమవన్ అంటే తగినవాడు అర్హుడు అని అర్థం చెప్పుకోవాలి. ఇక్కడ వ్యాఖ్యానంతో పాఠనిర్ధారణం సాధ్యంకాదు. అరుంబద కారులు మాత్రం "ఆమ్ మకన్" అని వివరించేరు. అయినప్పటికీ, ఆమవన్ అన్న పాఠమే విశిష్టమైనపాఠమని తమఆచార్యులు సాయించేవారని అణ్ణంగరాచార్య స్వామి ఉవాచ. ఈపాఠంలో ఏ అస్వారస్యమూ లేదు అంటారు PBAస్వామి.

కాని, పుకழ்అనేపదాన్ని "పోற்றுతఖ్కు"అన్నపదంతోచేర్చి కీర్తించి స్తుతించటానికనిచెప్తే అదిస్వరసమూ కాదు, రెండుపదాలకీ అర్థంఒకటే గనుక ద్విరుక్తి దోషమూ వస్తుంది. అందుచేతనే పుకழ்వానవర్ -స్తుతించబడే నిత్యసూరులు అనే అర్థం సాయిస్తున్నారు పెరియవాచ్చాన్పిళ్ళై. ఇక పూమకన్ అని బ్రహ్మగారిని చెప్పటం మూలప్రకృతిమండలాన్ని చెప్పినట్లు భావించి పుకழ் వానవర్ అని ఆయనచేతకూడా కీర్తించబడే నిత్యసూరులను చెప్పినట్లన్నమాట. పోற்றுతఖ్కామకన్ అన్నప్పుడు "ఆమవన్" అన్నపాఠం (అణ్ణఙ్గరాచార్యస్వామి వారి ఆచార్యులవారు సాయించిన పాఠం)ఎక్కడా కనబడదు. అన్ని పాదాల్లోనూ "క" యే తగియున్నది. పెరియవాచ్చాన్పిళ్ళై అదే పాఠం అంగీకరించి వ్యాఖ్యానించేరు. ఉత్తమూర్వారుకూడా దాన్నేసమర్థించేరు. అప్పుడు మకన్ అనే పదం "వానిళవరశు వైకున్దక్కుట్టన్" అన్నట్టుగా నిత్యయౌవనంగల యువరాజుగనే ఎప్పుడూ ఉండడాన్ని చెప్తుంది. అకన్ అనటానికి అకన్ఱ - దూరమైన అనే అర్థాన్ని కొన్ని నిఘంటువుల్లో చెప్పబడింది. అకల్ అన్నదే ముందువెనుకలనున్న పాదాలకి తగినట్లుగా అకన్ అని చెప్పినట్లౌతుంది. ఈవిధంగా సంశ్లేషం కలిగితే, పోற்றுతఖ్కామ్ అనే పదంకూడా నుదుటికి గుర్తు అవుతుంది. అప్పుడు ఆమ్ అకన్ అని విడదీయాలి. అప్పుడు ఏమి అర్థం చెప్పుకోవాలంటే - పూమకన్ అన్నప్పుడు బ్రహ్మగారిగొప్పతనాన్ని చెప్పినట్లన్నమాట. ఇతరదేవతలుకూడా లోకంలో అందరిచేతా స్తోత్రాలు, యాగాలు చేసి కీర్తించబడుతున్నారు. అటువంటివాళ్ళు వచ్చి స్తుతించేటట్లు ప్రసిద్ధిని పొందింది దేవకీదేవి అంటే ఆమెయొక్క భాగ్యాన్ని ఏమని చెప్పాలి? స్తుతించబడ్డవారు స్తుతిస్తున్నారని తెలిసేలా నిత్యసూరులనకుండా స్తుతించబడే నిత్యసూరులని చెప్తున్నది.

అణివాళ్ నుతల్ తేవకి - సాక్షాత్తు పరమపురుషుడే వచ్చి కుమారుడుగా అవతరించటంవల్ల కలిగిన మహాసంతోషంచేత దేవకీదేవిముఖం మరే ఆభరణాలూ అవసరం లేకుండానే అత్యుజ్జ్వలంగా చాలా అందంగా వెలిగిపోతూ ఉన్నదిట. దేవకీదేవి గర్భంలో ఎంబెరుమానుడు వేంచేసి ఉన్నప్పుడు వాళ్ళందరూవచ్చి ఆయనని స్తుతించటం ప్రసిద్ధం. వాళ్ళువచ్చి స్తోత్రంచేస్తు న్నప్పుడు తనగర్భంలో పరమాత్మ ఉన్నాడన్న ఆనందంచేత ఆమె నొసలు, ముఖమూ ప్రకాశిస్తున్న అందం -అకన్ ఇత్యాదిప్రయోగంతో అనుసంధించ బడింది. తేవకిమకన్ అని అనకుండా తేవకి మా మకన్ అని అనటంచేత కృష్ణుడు పెరిగి పెద్దవాడవటాన్ని



చూసినవాళ్ళు ఇతడు దేవకి కుమారుడు కాడు, అతని సహోదరుడై ఉండాలి" అని అనుకునేటట్లు ఉండటంచేత అనువంటి పెరుగుదల ఉండేటట్లు ఆమెచేత పెంచబడినవాడు అనే భావన కలగటానికి ఈ ప్రయోగం చెయ్యబడిందంటారు అణ్ణంగరాచార్యస్వామి.

మికుశీర్ వశుతేవర్తమ్ కోమకన్ - ఇక్కడ వ్యాఖ్యానచక్రవర్తి శ్రీసూక్తి - కోమకన్- నాయకుడైన కుమారుడు. చక్రవర్తివలెనే ఒకరిచేత నియమించబడేవాడు కాడు. వీళ్ళనికూడా నియమించే కుమారుడు. వాళ్ళని నియమించటం అంటే, కంసుడిభయంవల్ల ఈపిల్లవాడికి ఏమిఆపదవస్తుందోనని వాళ్ళు భయపడుతూం డటంచేత "నాయనగారూ, మీరందరూ ఎందుకు భయపడుతారు? భయపడ కుండా నే చెప్పినమాటవిని మీరు సుఖంగా ఉండండి" అని అంటున్నట్టు నియమించటం. సర్వేశ్వరుడు అవతరించాలని అందుకోసం తాము అన్నికష్టాలనీ సహించి ఎదురు చూస్తూన్న మహానుభావులకున్న గొప్పతనం ఆమెకికూడా ఒక అతిశయాన్ని తెచ్చిందిగనుక మికుశీర్ అని ప్రయోగించటంజరిగిందంటారు ఉత్తమూర్వారు. కృష్ణుడు వాళ్ళకోరికనంగీకరించి తనను గోకులంతీసుకుపోవాలని ఆ వసుదేవుడిని నియమించటం మొదలైన వాటన్నిటినీ సూచించటానికి కోమకన్ అని ప్రయోగించటం జరిగింది. కో అంటే స్వామి, నియామకుడు అని అర్థం. కోమకన్ అంటే, రాజు, రాజకుమారుడు నాయకుడు అని అర్థాలున్నాయి. నాయకుడున్నూ, కుమారుడున్నూ అయినవాడు అనికూడా చెప్పవచ్చును. "యువాం మాం పుత్రభావేన బ్రహ్మభావేన చాసకృత్" అని చెప్పబడటం ఇక్కడ గమనించతగ్గది.

కోమకన్ వరిల్ కూడిడు కూడలే - అటువంటి కృష్ణుడు నావద్దకు వచ్చే భాగ్యం కలిగించాలి అనే కోరిక అంతరార్థం. వరిల్ అనటంచేత వచ్చేటప్పుడు ఆనడకలోని అందం చూడటంలో అభినివేశం కలిగియున్నదన్నమాట. కూడిడు కూడలే - నీవు చేరి, నన్నూ, ఆయననీ చేర్చుమా అని అర్థం అంటారు పెరియవాచ్చాన్పిళ్ళై.

అవతారిక: (వాలుగవ పాశురం) వెనుకటి పాశురంలో కృష్ణుడి అవతారాన్ని ప్రస్తావించటం జరిగింది ఇకపైన గోకులానికి వేంచేసినతరువాత జరిగిన వృత్తాంతాన్ని ఈ నాలుగవపాశురంలో సాయిస్తున్నది.

**మూ. ఆయ్చ్చిమార్కళుమాయరు మఞ్జిడ**
**పూ్త్తనీళ్కడమ్బేఱిప్పుకప్పాయ్న్దు**
**వాయ్త్తకాళియన్ మేల్ నడమాడియ**
**కూత్తనార్ వరిల్ కూడిడుకూడలే. 4**

ప్రతిపదార్థము: **పూత్త**= అప్పుడే పూచిన **నీళ్**= పొడవైన **కడమ్బు**= కదంబవృక్షమును **ఏఱి**= ఎక్కి **ఆయ్చ్చిమార్కళుమ్**= గోపికలును **ఆయరుమ్**= గోపాలకులును **అఞ్జిడ**= భయపడునట్లు **పుక**= మడుగులోనికి ప్రవేశించునట్లు **పాయ్న్దు**= చెట్టుమీదినుండి గెంతి **వాయ్త్త**= లోపలమరి ఉండలేక నీటిమీదికి వచ్చునట్లు చేయబడిన **కాళియన్**= కాళియసర్పంయొక్క **మేల్**= తలలపై **నడమ్**= అద్భుతమైన నాట్యమును **ఆడియ**= చేసి కటాక్షించిన **కూత్తనార్**= నాట్యమాడినస్వామి **వరిల్**= నావద్దకువచ్చి నాతోకలిస్తే **కూడలే**= ఓ సంశ్లేషాధి-దేవతా! **కూడిడు**= అట్లు జరుగునట్లు చేయుము.

వ్యాఖ్యానము: (నాలుగవ పాశురం) కాళీయుడిపడగలమీద కృష్ణుడు నర్తనంచేసిన వృత్తాంతాన్ని తల్చుకొని ఆండాళ్తల్లి ఈ పాశురాన్ని పాయిస్తున్నది. ఒకనాడు కృష్ణుడు దూడలను తోలుకొని ఎవళ్ళూ వెళ్ళని దారిలో వెళ్ళటం మొదలుపెట్టేడు. అప్పుడు మిగతా గొల్లపిల్లలు పిలిచి "కృష్ణా, ఆదారంట వెళ్ళవద్దు, అలా వెళితే యమునలో ఒక మడుగులో ఉంటూ ఆమడుగుని పూర్తిగా తన విషాగ్నితో మరిగించి త్రాగటానికి వీలులేకుండా చేస్తున్న కాళీయుడనే అయిదుతలలనాగం తన కుటుంబంతో ఉంటున్నాడు దగ్గరకి వెళ్ళినవాళ్ళందరిని చంపుతున్నాడు అంచేత మేం ఎవళ్ళం అక్కడికి వెళ్ళటానికే భయపడుతున్నాం" అన్నారు. అదివిన్న కృష్ణుడు వెంటనే ఆకాళీయుడిని దండించాలని భావించి ఆ మడుగుకి దగ్గరలో ఉన్న ఒక కదంబవృక్షంమీద ఎక్కి, ఆ మడుగులో గెంతి, ఆనాగంపడగలమీద ఎక్కి, గెంతుతూ నాట్యం చేసి తొక్కివేసి ఆ నాగానికి బాధకలిగేటట్లుచేసేడు. మాంగళ్యభిక్ష పెట్టమని తనని నమస్కరించి ప్రార్థించిన నాగకన్యల విన్నపం ప్రకారం ఆ కాళీయుడిని ప్రాణాలతో సముద్రంలోకి వెళ్ళమని అక్కడ బ్రతకమని ఆజ్ఞాపించి కాళీయుడి బెడద గోకులంలోవాళ్ళకి లేకుండా చేసేడు. ఈ ఐతిహ్యాన్ని ఇక్కడ తలుచుకొని ఆండాళ్ కృష్ణుడిని తాను



వివాహమాడేటట్లు చెయ్యాలని సంశ్లేషాధిదేవతని కోరుకుంటోంది.

ఆయ్చ్చిమార్కళుమ్ ఆయర్కళుమఞ్జిడ నడమాడియ" అని అన్వయం గాని "అఞ్జిడ కడమ్బేఱి ప్పుకప్పాయ్న్దు" అనిగాని చెప్పవచ్చును అంటారు అణ్ణంగరాచార్యస్వామి. భయమే స్వభావంగాగలవారు ఆయ్చ్చిమారులైతే భయమనేది ఎప్పుడూ కలగనివాళ్ళు ఆయర్లంటారు శ్రీపెరియవాచ్చాన్పిళ్ళై. అంటే అందరికీకూడా భయంకలిగేటట్లు ఆయన కాళీయుడి తలలమీద నృత్యం చేసేడన్నమాట.

అఞ్జిడ అనే పదం పాయ్న్దుఅనే పదంతోకలిపి చెప్పుకుంటే గోపాలకులు, గోపికలు అందరూకూడా అయ్యో మడుగులోకి పడిపోయినాడే ఏమవుతుందో అని భయపడేటట్లు చెట్టుమీదినుండి మడుగులోకిదూకేడన్నమాట. పూత్త- పూచినటు వంటి. కాళీయుడి విషపుగాలులవల్ల కాల్చివేయబడినట్లున్న కదంబవృక్షం కృష్ణుడి శ్రీపాదాలుతగలగానే చిగిర్చిపువ్వులతో నిండిపోయినదట. వేదం "విష్ణోః పదే పరమే మధ్వ ఉత్సః" అని చెప్తోందిగదా! ఆపాదాలనుంచి దివ్యమైన అమృతధార స్రవిస్తూంటే, మాడిపోయిన కదంబం పూచిందంటే అందులో అతిశయోక్తి ఎక్కడ? శ్రీరాముడు అయోధ్యని వదలివెళ్ళుతున్నప్పుడు అక్కడి వృక్షాలన్నీ "అపి వృక్షాః పరిమ్లానాః" అని చెప్పబడినట్లు వాడిపోయినాయిట. "పుష్పితాగ్రాణి మధ్యేన జగామ వదతాంవరః"అని రామాయణంలో చెప్పినట్లుగా ఆయన ఎక్కడికి వెళితే అక్కడచెట్లన్నీచక్కగా పూవులతోనిండిపోయేవట. రాయే స్త్రీగా మారి నప్పుడు కదంబవృక్షం పూచిందని వేరేచెప్పాలా అంటారు పెరియవాచ్చాన్పిళ్ళై

వాయ్త్త కూత్తనార్ అన్న పదాలను గమనిస్తే సర్వేశ్వరుడైన కృష్ణుడు తనశ్రీపాదాలను కాళీయుడి తలమీదవేసి నృత్యం చేసేటట్లు కాళీయుడికి భాగ్యం కలిగిందని చెప్పటం జరిగిందన్నమాట. అదేవిధంగా నావిశాలమైన వక్షంమీద ఆయన నృత్యం చేసే భాగ్యం కలగాలి అని ఈమె కోరుకుంటోందని చెప్పి వ్యాఖ్యాత ఆనందిస్తున్నారు. వాయ్త్తకాళియన్ అంటే కృష్ణుడు తనవక్షస్థలంమీద నర్తనంచెయ్యాలని ఈమెకోరుకుంటున్నదని ఆకాళీయుడి తలమీదస్వామి పాదాల నర్తనాన్ని పొందినందుకు చాలాసంతోషించి వాయ్త్త-కలిగిన అని అంటోంది. తాను ఆడపుట్టుకపుట్టకుండా కాళీయుడిగాపుట్టిఉంటే ఈభాగ్యాన్నిపొంది ఉండే దాన్నికదా! అమృతాన్నినింపుకున్న నాపాలిండ్లుపొందనిభాగ్యాన్ని విషంనింపు కున్న కాళీయుడి తలలు పొందేయే! ఎంత అదృష్టం చేసుకున్నాయో ఆ పడగలు

అని ఆమెపొందిన మనోస్థితిని వాయ్‌త్త అనే పదం తెలుపుతోంది. "కాళియస్య ఫణతాం శిరస్తు మే సత్కదమ్బశిఖరత్వ మౌళావప్తి జుష్టవన శైలసుందర! త్వత్పదాబ్జయుగమర్పితం యయోః - కృష్ణుడి శ్రీపాదస్పర్శం కలిగే భాగ్యం పొందిన కాళీయుడి శిరస్సుగాగాని, కదంబవృక్షశిఖరంగాగాని జన్మమెత్తవలెనని నాశిరస్సుకోరుకుంటోంది" అనిసుందరబాహుస్తవంలో శ్రీకూరత్తాழ்వాన్ సాయించిన శ్లోకం ఇక్కడ అనుసంధేయం.

నడమ్‌అనేది నటనమ్‌అనే సంస్కృతపదానికి వికృతి. నడమాడియఅంటే నృత్యంచెయ్యటం, సంచరించటం, నటించటం. ఆయన అనాయాసంగా సంచరించినట్లు నృత్యంచేసేడు. అది నాట్యశాస్త్రానికికూడ తెలియని అద్భుతమైన నటనమైందన్నమాట. అటువంటి నర్తనంచేసినవాడు అలాగే వెంటనే (ఆ శ్రమని తీర్చుకొనకుండగనే) వచ్చి తనను కౌగలించుకొనవలెనని ఆవిధంగా తాను ఆయనపడినశ్రమని తీర్చగలగాలని కోరుకుంటున్నది. 4

**మూ. మాడమాళిగై శూழ்మతురైప్పతి**
**నాడినన్‌తెరువిన్ నడువే వన్దిట్టు**
**ఓడైమామతయానై యుతైత్తవన్**
**కూడుమాకిల్ నీ కూడిడుకూడలే. 5.**

ప్రతిపదార్థం: **మాడమ్**= మేడలచేతను **మాళిగై**= భవనములచేతను **శూழ்**= చుట్టబడియున్న**మతురై**= మధుర అనునగరమునకు **పతి**= నాయకునిగ **నాడి**= వేంచేసి **నన్ తెరువిన్**= మావీధి **నడువే**= మధ్యను **వన్దు**= వచ్చి **ఇట్టు**= కొన్నికార్యములను చేసి **ఓడై**= నెత్తిమీదపట్టముగలదై **మా**= పెద్దదైన **మతయానై**= మదించిన ఏనుగును (కువలయాపీడమును) **ఉతైత్తవన్**= శ్రీపాదముతో ఎగురకొట్టి నశింపచేసిన కృష్ణుడు **కూడుమాకిల్**= నాతో వచ్చి చేరినచో **కూడలే**= ఓ సంశ్లేషమా **నీ కూడిడు**= నీవు మమ్ములను చేరునట్లు చేయుము.

వ్యాఖ్యానము: (నాలుగవ పాశురం) ఆనాడు మేడలూ మిద్దెలూ ఉన్న మధురానగరపు వీధులలో శ్రీకృష్ణుడు ఎలా నడిచేడో, కువలయాపీడం అనే మదించిన ఏనుగుని తన చేతులతోనే గుద్ది ఎలా అంతంచేసేడో తలుచుకొని



ఆవృత్తాంతాన్ని అభినివేశంతో ఇక్కడ చెప్తోంది. ధనుర్యాగంమిషమీద కంసుడు ఆహ్వానిస్తే శ్రీకృష్ణబలరాములిద్దరూ కంసుడి రాజగృహానికి వెళ్ళటంలో ఆ రాజగృహం వాకిలిలో బలరామకృష్ణులు వస్తూంటే వాళ్ళని ఏనుగుచేత తొక్కించిచంపి వేయాలని కంసుడు పన్నాగం వేసేడు. దాని ప్రకారం కువలయాపీడం అనే మదించిన ఏనుగుకి కోపంతెప్పించి అక్కడ వస్తున్న బలనామకృష్ణులపైకి వదిలించేడు. అప్పుడు ఆయాదవవీరులు దానిని ఎతిరించి దాని దంతాలు రెండింటిని చేలోంచి మొక్కతీగని పీకివేసినట్లు అనాయాసంగా పీకివేసి వాటినే అయుధాలుగా చెసికొని దానిని చంపివేసేరు. ఈవృత్తాంతం ఇక్కడ తెలుసుకోదగ్గది.

రెండోపాదం చివరనున్న వన్దిట్టు అని క్రియాపదం - ఉతైత్తవన్ అన్న నామవాచకంతో అన్వయించటంలేదు. కూడుమాకిల్ అన్నపదంతో అన్వయించ వచ్చు. అప్పుడు కృష్ణుడు గోకులంలో ఉన్నట్టు భావనాప్రకర్షం చెప్తుంది. మధురకి మాడమాళికైశూழ்అని విశేషణాన్నిచేర్చితే వచ్చే అస్వారస్యాన్ని చూపేరు పెరియ వాచ్చాన్పిళ్ళై. "అవన్ విల్విழ்వుక్కెన్ఱు కోడిత్తాన్, ఇవళ్ ఇవన్ వరవుక్కెన్ఱిరుక్కిఱాళ్ - కంసుడు ధనుర్యాగంమిషతో శ్రీకృష్ణబలరాములని ఆహ్వానించి, అక్కడ వాళ్ళని అంతంచేద్దామని పన్నాగం పన్ని, ఆవిధంగా తనశత్రువు నశించబోతున్నాడనే ఆనందంతో మధురని అలంకరించేడు. ఈమె (ఆండాళ్) కృష్ణుడు మీద ఉన్న ప్రేమచేత, ఆయన (తనని చూడటానికే) వస్తున్నాడని మధురానగరం అలంకరింపబడిందని అనుకుంటోంది." అంటారు.

"మతురైప్పతియిలే నన్దెరువిన్నడువే వన్దిట్టు" అంటేనే సరిపోతూండగా మళ్ళీ నాడి అని విశేషించటంవల్ల కృష్ణుడు తిన్నగా వచ్చి నా ఇంట్లో ప్రవేశించ కూడదు. 'నాచ్చియార్ తిరుమాళికై ఏది? ఏమండీ నాచ్చియార్ తిరుమాళిగై ఏది' అని ఊళ్ళోవాళ్ళందరినీ అడుగుతూ వెదుకుకొని రావాలి అని ఆమె ఆశించటం ఇందువల్ల మనకి తెలుస్తుంది.

మాడం అన్నా, మాళికై అన్నా ఒకటే అర్థం. కాని మాళికై అని విశేషంగా రాజగృహాన్ని చెప్పడం ఉన్నది. ఈ తిరుమొழ்ఱి కూడల్ తిరుమొழ்ఱి అవటంచేత రెండురెండుగా కలిపి చెప్పుకోవటం అన్నింట్లోనూ ఉన్నది. అందుచేతకూడా మాడమాళికైఅని రెండుపదాలని ప్రయోగించటం జరిగిందంటారు ఉత్తమూర్‌వారు. నన్‌తెరువిన్ - శ్రీవిల్లిపుత్తూరిలో ఇప్పుడున్న ఆండాళ్ ఉత్తరదేశంలోనున్న

మధురలో అప్పుడు ఉన్నవీధిని మనవీధి అనిచెప్పటం సరియైనదా అంటే, కాదంటే పాశురంలో మాడమాళికైశూழ் మతురైప్పతినాడి ఓడై మామదయానై యుతైత్తవన్ నమ్‌తెరువిన్ నడువేవన్దిట్టు కూడుమాకిల్‌అని అన్వయం చెప్పు కోవచ్చు. ఇప్పుడు మనవీధిఅని శ్రీవిల్లిపుత్తూర్‌లోనున్న వీళ్ళవీధిని చెప్పిందని చెప్పవచ్చును. వెనుక చెప్పినట్టు నడువే వన్దిట్టు అని చెప్పటంవల్ల అందరికీ తెలిసేవిధంగా బహిరంగంగా కృష్ణుడు మేం గోదాదేవి ఇంటికి వెళ్తున్నాం. అది ఎక్కడ అని అడిగి ఆమెకి అనుకూలంగా ఉన్నవాళ్ళని అందరినీ చూసి ఆనందించి రావాలని అని అన్నదని చెప్పవచ్చు.

"నమ్ తెరువిన్ నడువే" అన్నప్పుడు "గోకులం తనదైనట్లుగానే ఇక్కడ కూడా ఒక భవనం ఉన్నది. స్వామి ప్రీతితో వేంచేసిన అన్నిచోట్లలోనూ "దేవత్వే దేవదేహేయం, మనుష్యత్వే మానుషీ"అని విష్ణుపురాణం(1-9-145)లో చెప్పినట్లు ఒక్కొక్కతిరుమాళికై ఉంటుందంటారు పెరియవాచ్చాన్పిళ్ళై. మధురలో ఆండాళ్‌తల్లికి అంటూ ఒక వీధీ, తిరుమాళికై ఉంటాయా? అనే శంకకి పరిహారంగా ఇలా చెప్పేరేమో. ఉత్తర మధురలోనున్న వీధినికూడా మనవీధి అని చెప్పవచ్చును ఎలా అంటే, గోకులాన్ని తనదిగాభావించినట్లు మధురలో ఈమెకి ఇల్లూ, ఒకవీధీ ఉన్నట్లు ఈమె భావించిం దంటారు. తాను భూదేవియొక్క అవతారంగనుక, అటువంటి అవతారంగా ఆనాటి సత్యభామవంటివాళ్ళ ఇల్లూ, వీధీ, ఈమెవిగాభావించిందని చెప్పవచ్చును. అంతే కాదు, తనలాగనే కృష్ణుడిమీద ప్రేమగల త్రివక్ర, తనతండ్రిగారిలాగ అమితమైన భక్తిగల మాలాకారుడూ ఉన్నవీధిని మనవీధి అనిచెప్తోందనవచ్చును. కంసుడున్న వీధిని మనవీధనటానికి లేదు. కాని అది మన కృష్ణుడివీధి అయింది. అంచేత దాని నైనా మనవీధిఅన్నదని చెప్పవచ్చును. నమ్‌అని బహువచనప్రయోగం తను ప్రార్థిస్తున్న సంశ్లేషాన్నికూడా తనతోచేర్చుకొని చెప్పిఉండవచ్చును. లేదాఆయన తనతో చేరటానికి తగినట్టుగా తనకున్న విశిష్టతని చెప్పిందనవచ్చును.

ఇక్కడ నమ్‌అని ఆండాళ్ తనని చెప్పుతున్నదని పెరియవాచ్చాన్పిళ్ళై సాయించటం ఎంతవరకు సబబు? అనివిచారిస్తే - గోపికల సంశ్లేషవార్తని ఆండాళ్ ఈతిరుమొఴిలో అనువదిస్తోందికదా! అంచేత నమ్‌అని గోపికలనే చెప్పుకోవాలి. గోపికలకి మాత్రం మధురలో ఏవీధి అంటే, దాన్నే కృష్ణుడుతాను అడిగి తెలుసు కోవాలి అనేకోరిక కనిపిస్తోంది. ఈ తిరుమొఴి గోపికలమాటలకి అనువాదంకాదు.



ఆండాళ్ తానేసంశ్లేషం కలగాలనికోరుకొనటమే చెప్పుతున్నదన్నా తప్పు లేదు. ఇటువంటి భావన ఈ తిరుమొఴి చివరి పాశురం "ఆయ్చ్చియర్ కూడలై క్కుఴుఱ్కొత్తై మున్ కూఱియ" అని సాయించటంలో మనకి కనిపిస్తుంది.

వన్దిట్టు - ఇక్కడ ఇట్టు అన్నపదం సువాసనగల చందనాన్ని ఒంటికి రాసుకొనటం, పూలదండలని అలంకరించుకొనటం, చాకలివాడిదగ్గరనుండి తమకి తగిన వస్త్రాలని తీసుకొని ధరించటం మొదలైన పనులని చెప్పుతున్నదంటారు ఉత్తమూర్‌వారు. ఓడై - ఏనుగునుదుటిమీద కట్టబడిన పట్టం.

కూడుమాకిల్ - విరోధినిరసనమైపోయింది. ఇక నీవు చేర్చటమే తరువాయి సుమా ఓ సంశ్లేషమా! అని అంటోందన్నమాట.

అవతారిక: కువలయాపీడాన్ని చంపినతరువాత కంసుడిని చంపి తాను చక్రవర్తి (ఆండాళ్‌భావనలో ఉగ్రసేనమహారాజు కాక శ్రీకృష్ణుడే చక్రవర్తి) అవటాన్ని తరువాతి పాశురంలో చెప్తోంది.

**మూ.** *అఱ్ఱవన్ మరుతముఱియనడై*
*కఱ్ఱవన్ కఞ్జనై వఞ్జనైయిల్*
*చెఱ్ఱవన్ తికఴుమ్ మతురైప్పతి*
*క్కొఱ్ఱవన్ వరిల్ కూడిడు కూడలే.* 6

ప్రతిపదార్థము: ***అఱ్ఱవన్***= కారణజన్మగలవాడు ***మరుతమ్***= మద్దిచెట్లు ***ముఱియ***= నశించునట్లు ***నడై***= ఠీవితో నడచుటను ***కఱ్ఱవన్***= నేర్చినవాడై ***కఞ్జనై***= కంసుని ***వఞ్జనైయిల్***= వంచనచేత ***చెఱ్ఱవన్***= చంపినవాడై ***తికఴుమ్***= ప్రకాశించుచున్న ***మతురైపతి***= మధురానగరమునకు ***కొఱ్ఱవన్***= రాజైన కృష్ణుడు ***వరిల్***= నాతో కలసియుండుటకు వచ్చినచో ***కూడలే***= ఓ సంశ్లేషమా ***కూడిడు***= నీవు మమ్ములను చేర్చుము.

వ్యాఖ్యానం: (ఆరవ పాశురం) కృష్ణుడు యమళార్జునములనే రెండు మద్దిచెట్లమధ్యనుంచి పాకుకుంటూ వెళ్ళటమనే వృత్తాంతాన్నీ, కంసుడిని చంపినవిషయాన్నీ తలుచుకొని ఆ అపదానాలలో అభినివేశంతో ఈ పాశురాన్ని ఆండాళ్ తల్లి సాయిస్తున్నది.

కృష్ణుడు చిన్నపిల్లడుగానున్నపుడు ప్రమాదాలుకలిగించే అనేకమైన ఆటలలో ములిగిపోయేవాడు. అదిచూసి యశోద కోపంతెచ్చుకొని, కృష్ణుడి మొలకి తాడుకట్టివేసి ఆతాడుతో రెండోపక్కని ఒక రోటికి కట్టివేసింది. కృష్ఉడు ఆ రోటిని ఈడ్చుకుంటూ- దొర్లించుకుంటూ పాకుకుంటూ అక్కడున్న రెండు మద్దిచెట్లు జంటగా ఉంటే వాటిమధ్యనించి వెళ్ళేడు. కాని రోలు దొర్లుతూవచ్చి ఆరెండుమద్దిచెట్లవల్లా అడ్డుకుపోయింది. తాడుని ఇంకా గట్టిగా లాగేసరికి ఆమద్దిచెట్లురెండూ విరిగిపడిపోగా ఆమద్దిచెట్లుగా శాపంచేతమారిన నళకూబరుడు, మణిగ్రీవుడు అనే కుబేరుడికుమారుల శాపం పోయి వాళ్ళనిజరూపాలతో వచ్చేరు. వీళ్ళు పూర్వం ఒకప్పుడు ఎంతోమంది అప్సరసస్త్రీలతో బట్టలు లేకుండా జలక్రీడలు చేస్తున్నప్పుడు నారదమహాముని అక్కడకి వచ్చేరు. అప్పుడు ఆ అప్సరసస్త్రీలందరూ సిగ్గుతో తమబట్టలు కట్టుకొని కనబడకుండా వెళిపోయినారు. వీళ్ళుమాత్రం మధుపానం చేసిన మైకంలో బట్టలు లేకుండానే ఉంటే, నారదులవారు చూసి కోపించి చెట్లలాఉండిపోయిన మీరు చెట్లే అయిపోదురుగాక అని శపించేరు. వెంటనే వాళ్ళు శాపాన్ని వెనుదీసుకోమని ప్రార్థించేరు. "చాలాకాలం అయినాక శ్రియఃపతి మీదగ్గరకు వచ్చినప్పుడు ఈరూపాలు పోయి మీకు యథారూపాలు వస్తాయి" అని శాపం తీరేవిధాన్ని చెప్పి వెళిపోయినారు. ఈవిధంగా శాపంవల్ల చెట్లైపోయిన వీటిమీద కంసుడిచేత ఆజ్ఞాపించబడిన ఇద్దరు రాక్షసులు ఆవేశించి కృష్ణుడిని అంతంచేయాలని ఎదురుచూస్తూండగా కృష్ణుడు ఆ చెట్లని విరిచి వాళ్ళని అంతం చేసేడు.

అఱ్ఱవన్= "ఏకకంఠంతో ఘోషించబడిన...వాడు"అని అర్థం. అంటే ఆయన కారణజన్ముడన్నమాట. వినాశాయ చ దుష్కృతాం - పాపాత్ములని అంతం చెయ్యటానికి నిశ్చయంతో వచ్చినవాడు. కంసుని అంతంచెయ్యటానికే కృష్ణుడు అవతరిస్తున్నాడని, అటువంటివాళ్ళే అయినా కంసుడంత ప్రసిద్ధి లేని శిశుపాలుడు, దంతవక్త్రుడు- వీళ్ళని నశింపచేయటానికి నిశ్చయించుకున్నవాడు అని ఇదివరకే అశరీరవాణి వాక్కుద్వారా తెలియటంచేత, దానిని పూర్తిచేసేవాడు- అంటే ఆకార్యాన్ని చేయటానికి అవతరించినవాడన్న మాట. అందుకే ఆయన గోపాలకులంలో రహస్యంగా పెరిగి, మద్దిచెట్లు విరిగిపోయేలా వాటిమధ్యనుంచి వెళ్ళి వాటిని విరిచి వాటిని ఆవహించిన రాక్షసులని అంతం చేయటానికి నడవటం నేర్చుకున్నాడట. మరొకవిధంగా చెప్పుకోవాలంటే అఱ్ఱవన్ - ఇదివరకే



"ఆండాళ్‌కోసమే అయిన వాడీయన"అని నిశ్చయమై, ఇతర సంబంధాలని వదలుకున్నవాడు. కారణజన్ముడు అనటానికి, ఆండాళ్‌కోసమే అవతరించినవాడు అన్నట్లుగా తాను చేయవలసిన కార్యాన్ని నెరవేర్చినవాడు అని చెప్తారు. కృష్ణుడు అవతరించటం ఆండాళ్‌కోసమేనని ఏమైనాప్రమాణంఉన్నదా అంటే "పరిత్రాణాయ సాధూనాం" అని ఉండటంచేత, ఈమెకూడా సాధువైన వారిలో ఒకర్తెగనుక ప్రమాణం ఉందని పెద్దలంటారు. అదే కాకుండా సామాన్యంగా దుష్టనిగ్రహం, శిష్టపరిపాలన మొదలైనవాటికోసం వచ్చినవాడని చెప్పవచ్చును! అఱ్ఱవన్ అంటే తనదాసులకోసం ఏదైనా చెయ్యటానికి సిద్ధంగా ఉన్న పెరుమాళ్ళు అంటారు శ్రీమాన్ TSRగారు. "ఉన్ అడియార్‌క్కు ఎన్ శెయ్‌వన్ ఎన్ఱే ఇరుట్టి నీ" అని ఆళ్వారి శ్రీసూక్తినిబట్టి వారిలా అంటున్నారు.

మరుతమ్ ముఱియ నడై కఱ్ఱవన్ - మద్దిచెట్లరూపంలో ఉన్న ఇద్దరు రాక్షసులను ఆచెట్లను విరిచి అంతమొందించటంతో నడక నేర్చుకున్నవాడు - "యమళార్జునయో ర్మధ్యే జగామ కమలేక్షణః- తామరపువులవంటి నేత్రములు గన కృష్ణుడు యమళార్జునములనే మద్దిచెట్లమధ్యనించి వెళ్ళేడు" అంటుంది విష్ణుపురాణం(5-6-17). శ్రీతిరుమంగైఆళ్వారుకూడా "ఇఱై మరుడిఱ్ఱు వీళ్గ నడై కఱ్ఱ తెఱ్ఱల్" అని సాయించేరు గదా!

"అఱ్ఱ వల్ మరుతమ్ ముఱియ- తనను చంపటానికి నిశ్చయించుకొని వచ్చిన బలిష్టమైన మద్దిచెట్లు విరిగేటట్లు" అని అర్థం చెప్పవచ్చును కాని అది స్వారస్యం లేనిదంటారు అణ్ణంగరాచార్యస్వామివారు. పెరియవాచ్చాన్పిళ్ళై గారి వ్యాఖ్యానంలోనూ ఈవిధమైన పాఠాన్నిగురించి ఏమీ సాయించలేదు.

కఞ్జనై వఞ్జనైయిల్ శెఱ్ఱవన్- తనని చంపటానికి అవతరించిన దేవకి కుమారుడు యశోదదగ్గర ఎవరికీ తెలియకుండా పెరుగుతున్నాడని, ఇంకా అలాంటి కథలని నారదుడు చెప్పగా విని కంసుడు చాలా కోపంమీద కృష్ణుడిని చంపేయాలని నిశ్చయించుకొని ధనుర్యాగమనే ఒక మిష పెట్టి కృష్ణుడిని మధురకి ఆహ్వానించి ఎన్నోవిధాలుగా వధించటానికి మార్గాలని వెతకగా కంసుడి రాజసభలో కృష్ణుడు వెగంగా దుముకి కంసుడి సింహాసనంమీదికి ఎక్కి, వాడి కిరీటాన్ని లాగి క్రిందకు తోసివేసి, వాడి జుత్తుపట్టుకొని వాడిని త్రోసి వాడిమీద తాను పడి వాడిని చంపివేసేడు. త్రేతాయుగంలో శత్రునిరసనానికి రాముడు ధర్మయుద్ధమే చేసేడు కాని ద్వాపరయుగం చివరను కంసుడనే వంచనని కృష్ణుడు వంచనలతోటే

నిరసించేడు. పెరియవాచ్చాన్పిళ్లై "ధర్మయుద్ధమే చెయ్యాలి అనే పెరుమాళ్ళ (రాముడి)లాగ ఉండి ఉంటే, వాడివంచనే పూర్తి అయిపోవును. వాడు అనుకున్న వంచనని వాడి(ఆ వంచన)తోటే పోయేట్లు చేసేడు" అని సాయించేరు.

వఞ్జనైయిల్- మారువేషంలో ఉండి మోసంచేసి ప్రవేశించి చంపుతూ ఎంతోమందిని చంపివాడున్నూ, ధనుర్యాగానికి ఆహ్వానిస్తున్నట్లు మోసంతో పిలిచి చాణూరముష్టికులనే మల్లులతో యుద్ధం చేయించిన కంసుడిని ధనుర్యాగానికి వచ్చినవాళ్ళలాగనే వచ్చి తానుకూడా వంచనతోటే కంసుడిని అంతమొందించిన వాడు అని చెప్పవచ్చును. వంచనకి స్థానమైన కంసుడిని అనికూడా ఈపదానికి అర్థం చెప్పవచ్చును.

తిక్రుమ్ - "మధురా భగవాన్ యత్ర నిత్యం సన్నిహితో హరిః" అని చెప్పినట్లు కృష్ణుడు అవతరించటానికి పూర్వమే చాలాకాలం ముందరనుండీ కూడా సర్వేశ్వరుడి వాసస్థానంగా మధుర ప్రసిద్ధి చెందింది. శత్రుఘ్నుడు లవణాసురసంహారం చేసి చక్కబెట్టిన నగరంకూడా ఇదే. తిక్రుమ్ అన్నది నశింపచేసేవాడికి గుర్తు అనిచెప్పవచ్చు. కృష్ణుడు కంసుడిని సంహరించిన తరువాత, కుమారుడిని పోగొట్టుకొన్న తన మాతామహుడైన ఉగ్రసేనమహారాజుని జైలునుంచి బైటకి రప్పించి, మధురకి మహారాజుగా సట్టాభిషేకం జరిపించినవాడు గనుక తిక్రుమ్- ప్రకాశించే మధురానగరాధిపతిగా చెప్పటానికి తగినవాడు ఉగ్రసేనుడే అయినా, కృష్ణుడే రాజు అనే ఆండాళ్ భావించింది. ఉగ్రసేనమహారాజు కూడా కృష్ణుడే తనకి నాయకుడని స్వీకరించేడన్నమాట. "నహి పాలనసామర్థ్యం ఋతే సర్వేశ్వరం హరిమ్ - సర్వేశ్వరుడైన శ్రీహరికి తప్ప వేరెవరికీ పరిపాలించ గల సామర్థ్యమే లేదుగదా"అని ప్రమాణప్రసిద్ధి. ఆణ్డాళ్ "మతురైయార్ మన్నన్" అని వారణమాయిరంలో ఇదేవిషయాన్ని సాయించింది. పెరియాళ్వారుకూడా "వాసుతేవన్ మతురై మన్నన్ - వసుదేవుని కుమారుడు మధురకి పాలకుడు" అన్నారు గదా! వరిల్ కూడిడు కూడలే - ఆయన నాతో చేరాలని వస్తే నీవు ఆయనను నాతో చేరేటట్లు చెయ్యి. ఆయనని రాజు అని చెప్తున్నదే ఈమె, రాజులు ఏమైనా చెయ్యాలనుకుంటే వారికి ప్రేరకం అవసరముంటుందా? అంటారు పెరియవాచ్చాన్పిళ్ళై.

అవతారిక: (ఏడవ పాశురం) శిశుపాలవధవంటి అయిదారు వృత్తాంతాలని



ఇందులో అభినివేశంతో ఆండాళ్‌తల్లి సాయిస్తోంది. దుష్టనిగ్రహానికి నిర్ధారించబడ్డ వాడు ఈయన. సృష్టి, స్థితి సంహారాలలో స్థితి అనేది స్వయంగా ఇతడిచేతనే చెయ్యబడుతోంది. "నహి పాలనసామర్థ్యం ఋతే సర్వేశ్వరం హరిమ్" అని పరాశరభగవానుడు విష్ణుపురాణంలో చెప్పియున్నాడు. ఇట్లా ఈయన కంసవధకై అవతరించేడనటంవల్ల కారణజన్ముడని చెప్పినట్లే, శిశుపాలుని వధించటానికిన్నీ ఈయన కారణజన్ముడే అయినాడు. ఎందువలనంటే, ఒకానొకప్పుడు వైకుంఠానికి ద్వారపాలకులుగాఉన్నవాళ్ళే హిరణ్యాక్షహిరణ్యకశిపులుగను, రావణకుంభకర్ణులు గను జన్మించినట్లే, శిశుపాలదంతవక్త్రులుగ పుట్టినందువల్ల వారిని సంహరించటం కోసం కృష్ణావతారము సంభవించింది. శిశుపాలుడు పుట్టుకతోనే నాలుగు చేతులతోను, మూడు కన్నులతోను పుట్టేడు. అప్పుడు ఆకాశవాణి " ఈ పిల్లవాడిని ఎవళ్ళు ముట్టుకొన్న వెంటనే వీడి ఎక్కువచేతులు కన్నును పోతాయో, అతడే వీడికి సంహారకుడౌతాడు" అని చెప్పింది. ఆతరువాత ఒకప్పుడు కృష్ణుడు ఆ పిల్లవాడిని స్పృశించగనే ఆశిశువుకున్న ఎక్కువ చేతులు, కన్ను పోయినాయి. దానితో కృష్ణుడే వాడికి సంహారకుడని నిశ్చయమైనట్లు తెలిసింది. అందుచేత, కంసునివిషయంలోలాగనే, శిశుపాలుని విషయంలోకూడా ఈయనే నిర్ధారితుడని చెప్పబడుతోంది.

మూ. *అన్ఱిన్నాత శెయ్ శిశుపాలనుమ్*
*నిన్ఱనీళ్ మరుతు మెరుతుమ్ పుళ్ళుమ్*
*వెన్ఱ వేల్ విఱల్క్కఞ్జనుమ్ వీழ்మున్*
*కొన్ఱవన్ వరిల్ కూడిడుకూడలే.* 7.

ప్రతిపదార్థం: **అన్ఱు**= ఆనాడు రుక్మిణీదేవి స్వయంవరం జరిగిననాడు (కృష్ణుడు తనకుశత్రువని తెలిసిననాటినుండియు) **ఇన్నాత**= అప్రియములను (భయము లేకదూషణమునే) **శెయ్**= చేయుచున్న **శిశుపాలనుమ్**= శిశుపాలుడను వాడును, **నిన్ఱ**= శాపవశముచే రాక్షసవేషములోయున్న **నీళ్**= ఎత్తుగా బలముగా పెరిగి యున్న **మరుతుమ్**= జంటమద్దిచెట్లును **ఎరుతుమ్**= ఎద్దుగావచ్చిన అరిష్టా-సురుడును **పుళ్ళుమ్**= బకాసురుడును **వెన్ఱ**= జయించుటకుపట్టిన **వేల్**= బల్లెమును **విఱల్**= బలమునుగల **కఞ్జనుమ్**= కంసుడును **వీழ்**= నశించునట్లు

**మున్**= పూర్వము **కొన్ఱవన్**= కృష్ణావతారములో నశింపచేసినవాడు (కృష్ణుడు) **వరిల్**= నాతో చేరవలెనని వచ్చుచున్నచో **కూడలే**= ఓ సంశ్లేషమా **కూడిడు**= నీవు కలియునట్లు చేయవలెను.

వ్యాఖ్యానం: (ఏడవ పాశురం) ఈ ఏడవ పాశురంలో ఆండాళ్ కృష్ణుడి శత్రునిరనాన్ని ఇంకా చెప్పుతూ ఉన్నది. అన్ను - సంశ్లేషంలేని ఈనాటిలాగనే ఆనాడుకూడా రుక్మిణీదేవిని వివాహం చేసుకునేందుకు ప్రతిబంధకంగా ఉన్న ఆనాడు. విదర్భదేశంలో కుండినమని ఒక పట్టణం ఉండేది. దానికి భీష్ముడని రాజుగారు. ఆయనకి రుక్మి అనే కుమారుడూ, రుక్మిణి అనే కుమార్తె ఉండేవారు. ఆరుక్మిణి సాక్షాత్తు మహాలక్ష్మిఅవతారం. ఆమెకి యుక్తవయస్సురాగానే కృష్ణుడు వెళ్ళిఆమెని తనకిచ్చి వివాహం చెయ్యమని అడిగేడు. కాని రుక్మిణి అన్న అయిన రుక్మి ఆమెని చేదిదేశపు రాజైన శిశుపాలుడికి కట్టపెట్టాలని భావించినందువల్ల కృష్ణుడి కోరికని అంగీకరించలేదు. కొన్నాళ్ళు గడిచిన తరువాత, ఆ రుక్మిణి వివాహంకోసం స్వయంవరం ప్రకటించి అన్నిదేశాల రాజులనీ ఆహ్వానించేడు. వాళ్ళందరూ రావటంతోనే కృష్ణుడుకూడా బలరాముడు మొదలైన తనవాళ్ళతో ఆ కుండిననగరానికి వెళ్ళి వివాహం మొదటినాడు రుక్మిణిని తన రథంలో కూర్చుండబెట్టి ద్వారకకి/ మధురకి తీసుకువచ్చేడు. దాంతో అక్కడున్న దంతవక్త్రుడు మొదలైన రాజులు యుద్ధం చెయ్యటానికి వస్తే, వాళ్ళని బలరాముడు, కృష్ణుడుకూడా వాళ్ళు వెన్నుచూపి పారిపోయేటట్లు చేసేరు. రుక్మిణి అన్నగారైన రుక్మి "ఇట్లా చెయ్యటమెందుకు" అని ఎదురు యుద్ధంచేసి రుక్మిణిని వెనకకి తీసుకురావాలని అనుకొని కృష్ణుడిని అడ్డుకున్నాడు. అప్పుడు రుక్మిని చంపుతే రుక్మిణి బాధపడుతుందని వాడిని పట్టుకొని వాడిని రథంమొగకి కట్టివేసి, వాడి తల గొరిగించి, వాడికి మానభంగం చేసి తరువాత రుక్మిణిని యథావిధిగా వివాహం చేసికున్నాడు. ఇది ఇలా ఉండగా శిశుపాలుడు పుట్టినప్పుడు నాలుగు చేతులతోను, మూడు కళ్ళతోనూ పుట్టేడు. అప్పుడు అందరూ ఇది ఏమిటి ఇలాగ అని ఆశ్చర్యపోతూండగా, ఆకాశవాణి ఎవరు వీడిని ముట్టుకొంటే వీడికి వచ్చిన మూడవ, నాలుగవ చేతులూ, మూడోకన్నూ పోతాయో, అతని చేతిలోనే వీడికి చావు అని చెప్పింది. అలాగనే ఎంతోమంది ఆ పిల్లవాడిని ముట్టుకున్నా పోనటువంటి అధికమైన ఆ చేతులూ, కన్నూ కృష్ణుడు



ముట్టుకొనేసరికి పోయినాయి. దాంతో వీడిని చంపేవాడు కృష్ణుడే అని తెలుసు కున్న శిశుపాలుడి తల్లి (కృష్ణుడికి మేనత్త) వాడు ఏదిచేసినా నాకొడుకుని చంప నని నాకు మాట ఇయ్యి అనికృష్ణుడిని అడిగింది. అప్పుడు కృష్ణుడు ఆమె అడిగినదానికి కృష్ణుడు "వీడు నావిషయంలో నూరుతప్పులు చేసేంతవరకూ వీడిని నేను క్షమిస్తాను" అని ఆమెకి మాట ఇచ్చేడు. ఆ తరువాత శిశేపాలుడు తనకి కృష్ణుడు శత్రువు అని ఆమెవల్లనే తెలుసుకొని దానివల్లనూ, పూర్వజన్మ వాసనచేతనూ పగ పెంచుకున్నాడు. ఎప్పుడూ కూడా ఆ స్వామిగుణాలని, దివ్యచేష్టితాలనీ నిందించటమే పనిగా పెట్టుకొన్నాడు. వీడికిచ్చి పెళ్ళిచేయాలను కున్న రుక్మిణిని కృష్ణుడు బలవంతంగా వివాహం చేసుకొనటంమొదలు వీడు కృష్ణుడి విషయంలో బాగా వైరం పెంచుకున్నాడు. ఇంద్రప్రస్థనగరంలో జరుగు తున్న రాజసూయయాగంలో కృష్ణుడికి అగ్రపూజచెయ్యటానికి సిద్ధపడటంతో హద్దులేకుండా కృష్ణుడిని నిందించటం మొదలుపెట్టేడు. దానితో కృష్ణుడు చక్రంతో వాడి తల ఖండించివేసేడు. శిశుపాలుడు చనిపోయి తేజోరూపమైన దివ్యశరీరం పొంది సర్వేశ్వరుడి శ్రీపాదాలని చేరేడు.

ఈపాశురంలో శిశుపాలవధ చెప్పాలని ఆండాళ్ భావించిందని పెద్దలు భావిస్తారు. ఆవధకూడా మద్దిచెట్లని ఎంత అనాయాసంగా కూల్చేడట అంతసులభంగానూ చేసేడని చెప్పటం కోసం ఆవృత్తాంతాలని దృష్టాంతాలుగా భావించి వాటిని తల్లి సాయిస్తున్నది.

స్థావర,పశుపక్ష్యాదులవధకి సమానమై ఉన్నది కంసవధ. అదేవిధంగా ఉన్నది శిశుపాలుడిని వధించటం కూడా అని చెప్పటం ఇక్కడ ఆమె ఉద్దేశ్యం. నిన్ఱ అన్నపదం స్థావరాలని సూచించటంకోసం వాడబడింది. ఇన్నాదన అంటే ఇష్టం లేనివాటిని చెపుతుంది. అందరిచేతా వదిలివెయ్యవలసినవి అన్నమాట. "పలపల నాழம்శొల్లి ప్పழித్త శిశుపాలన్" అనీ, "కేట్పార్ శెవిశుడు కీழமై వశవుకళే వైయుమ్, శేట్పాల్ పழம்పకైవన్ శిశుపాలన్" అనీ ఆழ்వారులు సాయించటం గమనించతగినది. ఇన్నాదన అని రుక్మిణిని వివాహమాడప్రయత్నించటం, ధర్మపుత్రుల రాజసూయయాగంలో కృష్ణుడికిచేసిన అగ్రపూజని సహించలేక ఎన్నో నిందోక్తులని చెప్పటం మొదలైనవి సూచించబడ్డాయి. ఎరుతుమ్ అంటే అరిష్టాసురుడనే రాక్షసుడు కంసుడిచేత కృష్ణుడిని అంతంచెయ్యటానికి పంపబడితే వాడు ఎద్దువేషంలో వచ్చి ఆవులనన్నింటినీ కుమ్మివేసి, గోకులంలో

భయంకలిగించి కృష్ణుడికడుపుమీదికి వచ్చి కొమ్ములతో పొడిచి చంపెద్దామని ప్రయత్నించేడు. కృష్ణుడు వాడి కొమ్ములుపట్టి కదలకుండాచేసి కాలితో వాడి కడుపుమీద పిడుగుల్లాంటి తన్నులుతన్ని మెడపట్టి తిప్పివేసి వాడి కొమ్ములలో ఒకదఅన్ని విరిచివేసి వాడిని అంతంచేసేడు. ఎరుతుమ్ అని చెప్పినప్పుడు ఏడు ఎద్దులు అని కూడా చెప్తారు. శుంభుడనే గోపాలకుడు తనకుమార్తె అయిన నీళాదేవిని (నప్పిన్నపిరాట్టిని) వివాహం చేసుకొనేందుకు కన్యాశుల్కంగా ఎవరికీ లొంగనివి, అసురావేశంతో ఉన్నవీ అయిన ఏడెద్దులను లొంగతీసుకోవాలని నియమం పెట్టినందువలన దానినికూడా కృష్ణుడు పాటించి ఆ సప్తవృషభాలనీ మట్టుపెట్టి నప్పిన్నపిరాట్టిని వివాహమాడేడు.

పుళ్ళుమ్ - బకాసురుడు అనే రాక్షసుడు కృష్ణుడిని చంపటానికి కంసుడిచేత పంపబడ్డాడు. వాడు కొంగవేషంలో వచ్చి సమయంకోసం ఎదురుచూస్తూండగా కృష్ణుడు ఆకొంగ ముక్కుని రెండుచేతులతోనూ పట్టుకొని రెండుగా చీల్చివేసి దాన్ని చంపేడు.

కొన్దవన్ వరిల్ కూడిడు కూడలే - ఒకే ప్రయత్నంలో అందరువిరోధులని నిరసించినవాడు ఈనాడు తగిన సంశ్లేషావకాశాన్ని ఎదురుచూస్తున్నాడు. అందుచేత ఓ సంశ్లేషమా నీవి నన్ను ఆయనతో చేర్చుమా అని ఆండాళ్ తల్లి ప్రార్థిస్తున్నది. 7

**మూ. ఆవలన్బుడైయార్తమ్ మనత్తన్ని**
**మేవలన్ విరైశూఴ్ తువరాపతి**
**క్కావలన్ కన్టుమేయ్త్తు విళైయాడుమ్**
**కోవలన్ వరిల్ కూడిడు కూడలే 8**

ప్రతిపదార్థము: **ఆవల్**= తనయందు అభినివేశము కలుగునట్లు నోములను నోచుట మొదలగు అభినివేశమును **అన్బు**= ప్రీతియు(స్నేహమును) **ఉడైయార్తమ్**= గలిగినవారి **మనత్తన్ని**= మనసు(లో)గాక **మేవలన్**= వేరువాటిని సహించనివాడును (వేరెక్కడను) **విరై**= పరిమళముచేత **శూఴ్**= వ్యాపింపబడిన **తువరాపతి**= ద్వారకానగరమునకు నిర్వాహకుడును **కావలన్**= జగత్తును కాపాడువాడును అయి



**కన్టు**= పశువులను **మేయ్త్తు**= మేపుచు **విళైయాడుమ్**=గోపబాలకులతో ఆటలాడుచున్న (లీలారసముననుభవించుచున్న) **కో**= గోవులను రక్షించుటకు**వలన్**= సమర్థుడైన కృష్ణుడు **వరిల్**= నాతో కలియవలెనని సంకల్పించునట్లు **కూడిడు కూడలే**= ఓ సంశ్లేషమా నీవు మమ్ములను ఒకటిగా చేర్చుము.

వ్యాఖ్యానం: (ఎనిమిదవ పాశురం) మదురని వదిలి, ద్వారకలో పదహారువేలమంది రాణులవంటివారితో ప్రకాశిస్తున్న విషయం ఇందులో ఆండాళ్తల్లి చెప్తోంది.

తువరాపతి - ద్వారకాధీశుడు. నడిసముద్రంలో తనకంటూ ఒకద్వీపాన్ని ఏర్పాటుచేసికొని అక్కడ కృష్ణుడివల్ల సృష్టించబడిన నగరం ద్వారక. ఇది సముద్ర మధ్యంలో ప్రత్యేకంగాపూదోటలతోనిండి ఉండడంవల్ల బాగాపరిమళిస్తూ పదహారు వేలమందిరాణుల సువాసనలతోనునిండి ప్రసిద్ధిచెందిననగరం. కృష్ణుడుబాల్యంలో గోపబాలులతో తిరిగినట్లుగా, యౌవనంలోనూ ద్వారకలోనున్నవాళ్ళమీద ప్రీతితో ఉండేవాడు. అందుకుకారణమేమిటంటే అక్కడున్నవాళ్ళందరూకూడా కృష్ణుడంటే వెర్రిప్రేమతో ఉండటం. ద్రావిడంలో దీన్ని ఆవల్, అన్బు అన్నారు.

ఆవల్ అన్నా, అన్బుఅన్నా సామాన్యంగా ప్రేమఅనే అర్థంచెప్తారు. కాని, కోపం, రోషం మొదలైన పదాలకి చిన్నభేదం ఎలా ఉన్నదో, అలాగే వీటికి కూడా చిన్నభేదం ఉన్నది. ఆవల్అంటే "ఎమ్బెరుమానై ప్పెఱవేణ్డుమ్, అవనుక్కు క్కైంకర్యం శెయ్య వేణ్డుమ్- పరమాత్మని పొందాలి, ఆయనకి కైంకర్యం చెయ్యాలి" అనిపించేటట్టున్న ఒకదృఢమైననమ్మకంవల్ల కలిగినప్రీతి. లేదా ప్రాప్యత్వర. దానికోసం నోములు నోచటం వంటి వాటిని ఆచరించటంలో ఉన్న ఆతురత. అన్బు- అంటే దానికి కారణమై ఆయన విషయంలో ఉన్న భక్తి, ప్రేమవంటి స్నేహం. ఇక్కడ ఒకఫలాన్ని పొందటానికి నోమునోచటం వంటి చర్యలని ఆవల్ అనీ, తనకి ఎవరిమీద ప్రేమ ఉన్నదో వారు ఎప్పుడూ సుఖంగాఉండాలనీ, వారికి ఎటువంటిఆపదలూలేకుండా జీవితంగడుస్తూ ఉండాలనీకోరటం, దానికోసం పల్లాండు, పల్లాండు అనిపాడటం అనేదాన్ని అన్బు అనీ చెప్తారు. అంటే పరమాత్మవల్ల తనకి ఒకప్రయోజనం ఉండి దానికోసం తమ ప్రయత్నాలు చెయ్యటమనేది ఆవల్. ఇక్కడ పరమాత్మనిపొందటం అనే ప్రయోజనంకోసం ఈమె కామదేవార్చన చెయ్యటం, మొదలైనవి ఆవల్ కిందకి వస్తాయి.

పెరియాఴ్వారిలాగ పెరుమాళ్ళ శక్తిసామర్థ్యాలు తెలిసినా ఆయనమీద ఉండే ప్రేమచేత కలిగిన అతిశంకకి లోనయ్యే మనస్తత్వం కలిగి, పరమాత్మకి సమృద్ధి కలగటమే తనకిప్రయోజనంగా ఉండటం అన్బు- ప్రేమ.

మేవలన్ - ఇష్టపడనివాడు అన్నమాట. తొల్కాప్పియంలో "నమ్బుమ్, మేవుమ్, నశైయాకుమే" అని చెప్పబడింది.

తువరాపతి క్కావలన్ - కాలయవనుడు అని ఒకడు మహాగర్వంతో తిరుగుతూ ఉండేవాడు. ఒకనాడు నారదులవారిని చూచి వాడు "ఈ లోకంలో శూరులైనవాళ్ళు ఎవళ్ళైనా ఉన్నారా?" అని అడిగేడు. మధురలో యాదవులు ఉన్నారు వాళ్ళు చాలా పరాక్రమశాలులు" అని నారదులవారు చెప్పేరు. ఆవెంటనే వాడు అక్కడినుండి బయలుదేరి మధురకివెళ్ళి యాదవులతో యుద్ధంచెయ్యటం మొదలుపెట్టేడు. అప్పుడు కృష్ణుడావిషయం తెలుసుకొని పడమటిసముద్రానికి వెళ్ళి అక్కడ సముద్రుడిని యాచించి పన్నెండుయోజనాల విస్తీర్ణమున్న స్థలంతీసికొని ద్వారక అని ఒక పట్నాన్ని ఏర్పరిచి, మధురలోఉన్న యాదవులని అక్కడికి తీసుకువెళ్ళేడు. ఆవిధంగా కాలయవనుడినుంచి వాళ్ళని విడిపించేడనఇ ఐతిహ్యం.

తువరావతి- ద్వారవతి అన్న సంస్కృతపదం వికారం చెంది తువరావతి అయింది. విరైశూఴ్ అని ఒక విశేషణాన్ని ప్రయోగించేరు. దానికి ప్రమాణం "మట్టేఱు కఱ్పకత్తై మాదర్క్కాయ్ వఙ్తువరై నట్టానై" (పెరియ తిరుమొఴ్ఴి 6-8-7)అని సాయించిన శ్రీసూక్తి. కృష్ణుడు సత్యభామకోరికమీద ఇంద్రుడిలోకం నుంచి పారిజాతవృక్షాన్నితీసుకువచ్చి ద్వారకలో నాటేడట. అందుచేత ద్వారకంతా కూడా ఎప్పుడూ సువాసనలతో నిండి ఉండేదట. అందుచేతనే విరైశూఴ్ అని ప్రయోగం.

కావలన్ కోవలన్- ఒకప్రక్కపరత్వమూ, మరొకప్రక్కసౌలభ్యమూఉన్నటు వంటి పరమాత్మ. 'సర్వస్య జగతఃపాలో వత్సపాలో బభూవతుః'అని విష్ణుపురాణం (5-6-35)లో చెప్పినట్లు అతిశయంగలవాడన్నమాట. బలరామకృష్ణులు తమని తాము రక్షించుకోలేనిగోవులని రక్షించటంలో ఆనందం పొందుతారట.

అవతారిక : (తొమ్మిదవ పాశురం) ఈవిధంగా 2వ పఆశురంలో తిరుక్కణ్ణపురంఅని కృష్ణుడిని గురించి విస్తారంగా చెప్పి, అక్కడ వామనుడని



చెప్పినదాన్ని ఇంకా వివరిస్తున్నారు ఈపాశురంలో. ఆతరువాత మొదటి పాశురంలో అనుసంధించిన సుందరబాహుస్వామిని చివరలోకూడా అనుసంధానం చేస్తున్నారు.

మూ. కొణ్డకోలక్కుఱళురువాయ్చ్చెన్రు
పణ్డు మావలితన్ పెరువేళ్వియిల్
అణ్డముమ్ నిలనుమడియొన్రినాల్
కొణ్డవన్ వరిల్ కూడిడుకూడలే. 9

ప్రతిపదార్థం: పణ్డు= పూర్వం ఒకప్పుడు కొణ్డ= తెచ్చి పెట్టుకొనిన కోలమ్= అందమూ, అలంకారమూ కలిగిన కుఱళ్= బ్రహ్మచారి వామన ఉరు= రూపం ఆయ్= కలిగినవాడై మావలితన్= మహాబలియొక్క పెరువేళ్వియిల్= గొప్ప యాగంలో శెన్రు= వెళ్ళి అడి ఒన్రినాల్= ఒక్కొక్క పాదముతోనే అణ్డముమ్= మీదిలోకాలనన్నింటినీ, నిలనుమ్= భూమిఅంతటినీ కొణ్డవన్= స్వాధీనం చేసు కొనినవాడు వరిల్= నాతోచేరటానికి రావాలనిఅనుకుంటే కూడలే= ఓ సంశ్లేషమా నీ కూడిడు= నీవు మమ్ములను చేర్చుమా!

వ్యాఖ్యానం : (తొమ్మిదవ పాశురం) వామనావతారం, త్రివిక్రమా-వతారాలమీది అభినివేశాన్ని ఈపాశురంలో ఆండాళ్‌తల్లి మనకి తెలియ జేస్తోంది. తన సహజమైన దివ్యమంగళరూపానికి అలంకారాలుగా యజ్ఞోపవీత, కృష్ణాజిన, పవిత్ర, దణ్డ, మౌఞ్జీమొదలైనవాటిని అలంకరించుకొన్నందువలన వచ్చిన అందాన్ని కోలమ్ అన్నపదప్రయోగంతోచెప్తున్నారు. ఆమెకి ఆశ్రీవైకుంఠంలో స్వామి దివ్యాలంకారభూషితుడుగానున్నఅందంకంటే ఈవామనుడిగా బ్రహ్మచారి కున్న అలంకారాలతో ఉన్న విగ్రహసౌందర్యమే ముచ్చటగొలుపుతున్నట్టుం దంటారు పెరియవాచ్చాన్పిళ్ళై. కొణ్డ కోలమ్ - కోలమ్ కొణ్డ అని అన్వయం చెప్పుకోవాలి. వేషముమ్ ఉరువమెల్లామ్- సహజమైనదానికంటే వేరుగా ఉన్న రూపం అన్నమాట. పెరు వేళ్వియిల్ - పెరుమాళ్ళని సేవించటానికి నేను ఈ పాట్లు పడుతున్నాను, భగవద్విభూతితస్కరులైనవాళ్ళలో ముఖ్యుడైన మహాబలి ఏమీ శ్రమలేకుండా ఆ స్వామిని యజ్ఞవాటికలో అరచేతిలో ఉసిరికాయలాగ సేవించగలిగేడే ఆయజ్ఞం ఎంత గొప్పదో అని ప్రశంసించటాన్ని చెప్పటానికి

కేవలం వేళ్విఇయిల్ అనకుండా పెరువేళ్విఇయిల్ అని ప్రయోగించటం జరిగిందంటారు అణ్ణంగరాచార్యస్వామివారు. ఏది కావాలని అడిగినా, దాన్ని ఇచ్చి, యాగానుష్ఠానం చెయ్యటంవల్ల అందరికీ సర్వేశ్వరుడి శ్రీపాదస్పర్శం కలిగేటట్లు చేయించటం మొదలైనవాటితోనున్న యాగానికి గొప్పతనం ఉన్నదికదా అంటారు ఉత్తమూర్‌స్వామి. (ప్రాప్యత్వరా, ప్రేమా ఉన్నట్లైతే రాక్షసుడినికూడా కాపాడుతాడు. ఫలానావిధంగా ఉంటేనే స్వామి కాపాడుతాడు అంటూ ఏమీ లేదు అన్నదే ఇక్కడ తెలియచెయ్యబడుతోంది) అడియొన్ఱినాల్ - ఒకే అడుగుతో లోకం అంతటినీ కొలవలేదుగనుక ఒక్కొక్క అడుగుతో అని అర్థం చెప్పుకోవటం. మూడడుగులూ భూమిమీద ఒకమూలకి ఒదిగిపోయినాయనటానికి లేకుండా భూమినంతటినీ ఒకఅడుగుతోనూ, మిగతాలోకాలన్నింటినీ మరొక అడుగుతోనూ కొలుచుకోవటాన్ని చూచి ఆశ్చర్యపోయి ఇలా చెప్పినది. వామనావతారంలో స్వామి మూడడుగుల నేల ఇమ్మని అడిగి దాన్ని పొందేడని "త్రీణి పదా విచక్రమే" అని వేదం చెప్తోందికదా ఆండాళ్‌తల్లి అణ్ణముమ్, నిలముమ్ అంటూ రెండే అడుగులని చెప్తోందే! దీనికి కారణం ఏమిటి? అని నంజీయరువారు భట్టరువారిని అడిగేరట. దానికి భట్టరువారి సమాధానం ఇలా ఉన్నదట - వేదంలో "పరో మాత్రయా తనువా వృధాన। నతే మహిత్వమన్వశ్నువన్తి। ఉభే తే విద్మ రజసి పృథివ్యాః। విష్ణోర్దేవత్వం పరమస్య విత్సే - ఓ మహావిష్ణో! నీవు విరాట్రూపాన్ని ధరించేవు కాని నీ గొప్పతనాన్ని ఎవరూ అర్థం చేసుకోలేకపోతున్నారు. రెండడుగులతో నీవు ఊర్ధ్వలోకాలనూ, భూమినీ కొలిచేవు. మూడో అడుగుతో దేన్ని కొలిచేవో నీకుమాత్రమే తెలుసును" ఇదే విషయాన్ని ఋగ్వేదంలోకూడా "ద్వే ఇదస్య క్రమణే స్వర్దృశోభిఖ్యాయ మర్త్యో భుఱన్యాతి। తృతీయమస్య నకిరా దధర్షతి వయశ్చన పతయన్తః పతత్రిణః॥ - విష్ణుమూర్తి కొలిచిన రెండడుగులు అందరికీ తెలుసును. దానితో వారు విష్ణువును స్తుతిస్తున్నారు. ఆయన తన మూడో అడుగుతో ఏభూమిని కొలిచేడో ఎవరికీ తెలుసుకోవటానికి సాధ్యం కాలేదు. అంతటా వీస్తున్న వాయువుగాని, అంతటా ఎగిరే పక్షులుగాని ఎప్పటికీ తెలుసుకోలేవు" అని చెప్పబడిఉన్నదట. అందుచేత ఆయన తన మూడో అడుగుతో దేన్ని కొలిచేడో అదేమిటి? బహుశః తనయొక్క అపారమైన కరుణచేత మహాబలియొక్క శిరస్సే తన మూడో అడుగుకి తగిన స్థలమని భావించి ఉండవచ్చు. అటువంటి దయ, కరుణ ఎవరికీ తెలియనిది,



తెలుసుకోసాధ్యంకానిది, ఇటువంటిది అని చెప్పటానికి సాధ్యం కానిదిగనుక వాయువుకాని పక్షులుగాని ఎప్పటికీ తెలుసుకొనలేనివే" అయితే మరొకలాగకూడా చెప్పుకోవచ్చు- ఆయన తననిత్యవిభూతిని మూడో అడుగుకింద కొలవటం. ఆ మూడవ అడుగు ఇంతది అని చెప్పటానికి మానవుడికిగాని, వాయువుకిగాని పక్షులకిగాని సాధ్యం కాదుగదా! ఇలా చెప్పటం"తృతీయమస్య నకిరా దధర్షతి వయశ్చ న పతయన్తః పదత్రిణః" అన్న వేదవాక్యానికి అనుగుణంగానే ఉన్నదికదా అందుచేత ఆండాళ్‌కూడా రెండడుగులనిమాత్రమే చెప్పి ఊరుకొని ఉండవచ్చు" అని భట్టరువారి సమాధానమట. పెరుమాళ్ళ తిరుమేనిలోని దివ్యహస్తాలు మొదలైన ఇతరావయవాలుండవచ్చు.కాని పాదం ఒక్కటీ చేసిన ఆశ్చర్యకరమైన చేష్టని చూడండీ అని అంటున్నదన్నమాట. కొణ్డవన్ - మనం అందరంకూడా ఆయన సొత్తుగనుక, ఆయన మనలనెవరినీ కూడా వదులుకొనడట. ఏదో ఒకవిధంగా తన సొత్తుని తాను వెనుకకు తెచ్చుకుంటాడట. అందుకే ఆయన వామనుడిగా అవతరించి మహాబలివద్దనుంచి యాచనతో తిరిగి తీసుకున్నాడట. 9

మూ. పఴకునాన్మఱై యిన్‌పొరుళాయ్ మత
మొఴుకువారణముయ్యవళిత్త ఎమ్
అఴకనారణి యాయ్‌చ్చియర్ శిన్దైయుళ్
కుఴకనార్ వరిల్ కూడిడు కూడలే. 10

ప్రతిపదార్థం: **అణి**= అందమైన **ఆయ్‌చ్చియర్**= గోపస్త్రీల **శిన్దైయిల్**= మనసులలో **కుఴకనార్**= అల్లరి, మంచి కలసియున్నటువంటివాడును **పఴకు**= అందరిచేతను, ఎల్లప్పుడును అనుసంధించబడు **నాల్ మఱై**= నాలుగు వేదములయొక్క **ఇన్**= మధురమైన**పొరుళాయ్**= ప్రతిపాద్యడును **మతమ్ ఒఴుకు**= మదము కారుతున్న**వారణమ్**= గజేంద్రుని **ఉయ్య**= ఉజ్జీవించునట్లు **అళిత్త**= కృపజేసినవాడును అయిన **ఎమ్ అఴకనార్**= మా తిరుమాలిరుంశోలైలో వేంచేసియున్న సుందరబాహుస్వామి **వరిల్**= వచ్చి నాతో చేరవలెనని **కూడలే**= ఓ సంశ్లేషమా! **కూడిడు**= సమకూర్చుమా!

వ్యాఖ్యానం: (పదవ పాశురం) గజేంద్రమోక్షవృత్తాంతాన్ని ప్రీతితో అనుసంధిస్తున్నదీపాశురంలో. వేదైశ్చ సర్వైరహమేవ వేద్యః అనిచెప్పబడి ఉండటంతో పழకునాన్మఱైయిన్ పొరుళ్ అని సాయించింది అమ్మ. అగ్ని, ఇంద్రుడు, వాయువు మొదలైన దేవతలగురించి వేదాల్లో కర్మకాండభాగమైన పూర్వభాగంలో విస్తారంగా చెప్పబడినప్పటికీ, ఆ వేదాలే అజ్ఞాన్యన్యాని దేవతాః అని ఆ దేవతలని సర్వేశ్వరుడికి అవయవభూతులని చెప్పింది. అందుచేత దేవతాంతరప్రశంసాపరమైన కర్మకాణ్డకూడా భగవత్పరమనే పెద్దలు చెప్పుతారు. వేదతాత్పర్యసర్వస్వం అనే గ్రంథంలో అణ్ణంగరాచార్య స్వామివారు ఈవిషయాలన్నింటినీ వివరంగా చర్చించేరు. వేదంచెప్పినది ఒక్కపరమాత్మనేనా, ఇతరమైన చేతనాచేతనాలులేవా అంటే మిగతవన్నీ కూడా ఏకవిజ్ఞానన్యాయసిద్ధం అంటారు పెరియవాచ్చాన్పిళ్ళైవారు. ఏక విజ్ఞానన్యాయం అంటే కారణంతెలిస్తే కార్యంతెలిసినట్లేగదా అనే న్యాయం. "యథా సోమ్యైకేన మృత్పిణ్డేన సర్వం మృణ్మయం విజ్ఞాతం స్యాత్" అని ఛాందోగ్యోపనిషత్తు కటాక్షించిందికదా. అందుచేత పరమాత్మని చెప్పితే ఇతర చేతనాచేతనాలన్నీ ఆయనకి శరీరములే అనీ చెప్పినట్లే అని భావం.

పழకు అనే పదానికి అనాదియైన, పురాతనమైన అని అర్థం చెప్పటం ఉన్నది. కాని పழకుతల్, ఇణఙ్గుతల్, వழఙ్గుతల్ అని నిఘంటువు చెప్తుంది. పழకునాన్మఱై అన్నపదం క్రియావిశేషణంతో నున్నపదం. అంటే అందరిచేతా ఆదరించబడే, అభ్యసించబడే నాలుగువేదాలలోనూ చక్కగాప్రతిపాదింప బడిన అర్థంఈయనేఅని మనంచెప్పకోవాలంటారు ఉత్తమూర్‌స్వామి. కొన్ని వేదాలు ఈయనని అంతర్యామిగా చెప్తున్నా, మొత్తంమీద వేదార్థాలలో పరమానందరూపమైన మధురమైనఅర్థం ఈయనే అని సాయించింది.

వారణమ్ ఉయ్య - ఈతిరుమొழி మొదటిపాశురంలో తిరుమాలిరుంజోలై సున్దరబాహుస్వామిని అనుసంధించటంవల్ల చివరగాకూడా ఆయనని అనుసంధించుతున్నది ఆణ్డాళ్‌తల్లి. అక్కడ ఏనుగులు విహరించటం, ఆనందంగా ఉండటంవల్ల గజేన్ద్రమోక్షాన్ని కటాక్షిస్తున్నది. ఆపరమాత్మ గజేంద్రుడి ఆర్తనాదం వినగానే పరుగుపరుగున వచ్చేడు



రక్షించాలని. అప్పుడు ఆ పరమాత్మ ఎలా ఉన్నాడో "స్రగ్భూషామ్బర మయథాతథం దధాన" అని శ్రీరంగరాజస్తవంలో భట్టరువారు సాయించిన ఆ అందాన్ని తలుచుకొని బట్ట, ఆభరణాలూ, మాలలు మొదలైనవాటినన్నిటినీ ఎలాపడితే అలానే ఉండగా అంటే చెదిరిపోయిఉన్నా వాటిని సర్దుకొనకుండానే బయలుదేరిన ఆస్వామి అందాలని తలచుకొని ఆ అభినివేశంతో అమ్మ చెప్పినదన్నమాట.

అణియాయ్‌చ్చియర్ శిన్దైయుళ్ కుழకనార్- "కొజ్గైమేల్ కుఙ్గుమత్తిన్ కుழమ్బழియ పుకున్దు ఒరునాళ్ తఙ్గుమేల్ ఎన్నావితఙ్గుమ్" అని ఆమె సాయించినట్లు ప్రేమ వృద్ధిచెందుతూన్నవారికి ఈయన అప్పటికప్పుడే వెళ్ళిసేవ సాయిస్తేతప్ప వాళ్ళు చాలా ఖిన్నమనస్కులై ప్రణయరోషం వచ్చి "ఆ కృష్ణుడు ఇక ఎప్పటికీ మనదగ్గరకి రాకుండానే వెళిపోయినాడు. ఎప్పటి కైనా ఒకనాడు వేరుగతిలేక వచ్చి మనెదుట నిలబడడా! అప్పుడు మనం అతనికి ముఖం చూపించవద్దు" అని కోపంతో నిశ్చయించుకొని ఉన్న వాళ్ళు కూడా కోపంతీరి మీదపడి కౌగలించుకొనేంతగా పిచ్చెక్కించే ఉపాయాలు తెలిసినవాడు కృష్ణుడని ఆండాళ్ ఈప్రయోగంవల్ల మనకి చెప్పుతున్నది.

ఎమ్ అழகనార్- మా అందగాడు- స్వామి అందాన్ని సుందరబాహు స్వామి అందంగా భావించిందంటారు ఉత్తమూర్ స్వామివారు. ఒక ఏనుగుని సరస్సులో కటాక్షించినవాడు, కంసుడి ఏనుగునొకదాని ప్రాణాలనే తీసినవాడు వేంచేసియుండే దివ్యదేశం, ఒక మదించినఏనుగు తన ఆడ(జత) ఏనుగు కోసం దానివెనుకరాగా నల్లనిమేఘంవంటి దివ్యమంగళవిగ్రహంగలవాడు పరిపాలిస్తూ వర్తిస్తున్న చల్లనితిరుమాలిరుంజోలై అనిపెరియాழ்வారు (4-2-5 లో)సాయించటం ఇక్కడ అనుసంధేయం. ఈవిధంగా,రాక్షసులు, తిర్యక్కులు, గోపాలకులుమొదలైన సమస్తప్రాణికోటినీ ఉజ్జీవింపజెయ్యటానికి వేంచేసిన అందగాడు అని సాయించినట్లైనది.

వరిల్ కూడిడు కూడలే - "అడియేన్ నుణియేన్- దాసుడిని, చాలా చిన్నవాడిని" అంటూ చాలా బ్రతిమలాడి గోపికలప్రణయరోషాన్ని తీర్చి, వాళ్ళలో ఒకడుగా కలిసిపోయి వాళ్ళ మనసులని రంజింపచేసినట్లుగా

నామనసునికూడా రంజింపచేసేలా వచ్చి నాతో ఒకనాడైనా కలిసి ఉండాలే అని అంటున్నది. 10

అవతారిక: సంశ్లేషాన్ని కలిగించమని కోరే ఈ పదిపాశురాలనీ అభ్యసించినవారికి కలిగే ఫలాన్ని చెప్తూ ఈతిరుమొழ்ழிని పూర్తిచేస్తున్నది ఆండాళ్‌తల్లి.

***మూ. ఊడల్ కూడ లుణర్తల్ పుణర్తలై***
***నీడునిన్ఱు నిఱైపుకழ்ఆయ్చ్చియర్***
***కూడలై క్కుழల్కోతై మున్ కూఱియ***
***పాడల్ పత్తుమ్ వల్లార్క్కిల్లై పావమే. 11***

***ఆణ్డాళ్ తిరువడికళే శరణమ్.***

ప్రతిపదార్థం: ***ఊడల్***= ప్రణయకలహమేమి, ***కూడల్ ఉణర్తల్***= సంశ్లేషాన్ని తెలుపటమైతేనేమి (లేదా, ప్రణయకలహం ముందరి సంశ్లేషమైతేనేమి, తెలియచెప్పటమేమి) ***పుణర్తలై***= తిరిగి కలియటమేమి- వీటినన్నింటిని ***నీడునిన్ఱు***= చాలకాలం అనుభవించి ***నిఱై***= పూర్తినిపొందటం అనే ***పుకழ்***= గొప్పతనంగల ***ఆయ్చ్చియర్***= గోపికాస్త్రీలయొక్క ***కూడలై***= సంశ్లేషం అనే మధ్యస్థితిని ***మున్***= మొట్టమొదట ***కుழల్***= అందమైన కేశపాశముగల ***కోతై***= ఆండాళ్ ***కూఱియ***= కటాక్షించిన ***పత్తు పాడల్ ఉమ్***= పదిపాశురములను ***వల్లార్క్కు***= అభ్యసించినవారికి ***పావమ్***= స్వామితో చేరటమనేదానిని అడ్డుకొనేటటువంటి పాపం ***ఇల్లై***= తొలగిపోవును.

వ్యాఖ్యానం: (పదకొండవ పాశురం) - ఈ తిరుమొழ்ழிని అభ్యసించినవారికి కలిగే ఫలాన్ని చెప్పి పూర్తిచేస్తున్నది ఈ పాశురం. ఊడల్-కూడల్ అన్నది ఊడల్ అంటూఒకటి, కూడల్ అంటూ ఒకటి అని చెప్పటంలేదు. ఊడల్‌తో అంటే ప్రణయరోషంతోఉండటం అనిఅంటే, కోపంమాత్రమేచెప్పినట్లౌతుంది. ఊడల్ అంటే ప్రణయకలహం.



ఊడల్-కూడల్ అంటే ఆ ప్రణయకలహంకలిగి ఉండటం అంటారు అణ్ణంగరాచార్యస్వామి. అంటే ప్రణయరోషవిశిష్టత్వం. “పోతుమఱిన్దు ప్పుఱమే వన్దు నిన్ఱీర్, ఎతుక్కితువెన్ ఇతువెన్ ఇతువెన్నో?” అనినీ్న, “ఎన్నుక్కు అవళై విట్టిఙ్గువన్దాయ్ ఇన్నమఙ్గే నడ నమ్బి నీయే” అనినీ్న, ఉన్నుడైయ శుణ్డాయమ్ నానఱివన్ ఇనియతు కొణ్డు శెయ్‌వతెన్, ఎన్నుడైయ పన్దుమ్ కలుమ్ తన్దు పోకు నమ్బి” అనినీ్న ఈసందర్భాల్లో చెప్పి ఎంబెరుమానుడిని దగ్గరకు రానీయకుండా అడ్డుకొనటం ఊడల్ అనబడుతుంది. . అందమైన కేశపాశములు గల గోదాదేవి ప్రియునితో తనకు సంశ్లేషాన్ని కలిగించమని సంశ్లేషం అనేదాన్ని ఒక వ్యక్తిగా భావించి, ప్రార్థించటం అనే ఈ కూడల్‌తిరుమొழ்ழிని ఫలశ్రుతితో పూర్తి చేస్తున్నది. కృష్ణుడినే ప్రేమించిన గోపికల ఊడల్, కూడల్, ఉణర్తల్, పుణర్తల్ అనే సంశ్లేష, ప్రణయరోష, విశ్లేషాద్యవస్థలని గురించి ప్రస్తావించిన ఈ పదిపాశురాలని ఎవరు అధ్యయనం చేస్తారో వారికి ఆపరమాత్మనుండి విశ్లేషముకలిగించవే పాపాలన్నీ తొలగిపోయి, నిత్యసంశ్లేషాన్ని పరమాత్మ కటాక్షిస్తాడు అని సాయిస్తున్నది.

ఊడల్-కూడల్ అంటే కావాలనుకున్నప్పుడు ప్రియుడితో కలవలేక, ఆయనని ఎంతప్రయత్నించినా ఆయన దొరకక, ప్రియుడిమీద ఆగ్రహం చెందటం. ఆతరువాత ఆయనతో కలిసి ఆనందంగా ఉండటం. ఉణర్తల్-పుణర్తల్ అంటే ప్రియుడితో నువ్వు నాతో కలవకుండా తప్పించుకు పోతున్నావు దానివల్ల నేను అమితమైన విరహవేదనని అనుభవిస్తున్నాను అని తెలియచెయ్యటం, ప్రియుడు తనవల్ల ప్రేయసికి అంతబాధకలిగినందుకు తాను చాలా బాధపడుతున్నానని, తాను కలవలేకపోవటానికి కారణాలు అనివార్యమైనవనీ, తాను ప్రేయసితో కలవటానికి ఎంతో ఆరాటపడుతూ ఎన్నో ప్రయత్నాలు చేసేడనీ ఆమెతో చెప్పి తిరిగి ఇద్దరూ కలిసి ఆనందంగా ఉండటం అనే అవస్థలు.

ఊడల్, ఉణర్తల్, పుణర్తల్ అనే ఈ మూడున్నూ తమిళకావ్యాల్లో ప్రేమకార్యాలుగా ప్రసిద్ధిచెందినాయి. ఊడల్ అంటే ప్రణయకలహం. అంటే

ప్రేయసిని కొంచెంకాలం విడచివెళ్ళిన ప్రియుడు ఆమెతో కలవడానికి తిరిగి వస్తే వాడిని సందేహించి ప్రేయసి వాడితో కలహం పెట్టుకొని దూరంగా ఉండటం. ఉణర్‌తల్ అంటే ఇద్దరినీ కలిపేవారిద్వారానో లేక తనంతట తానే ప్రియుడు తనలో దోషం లేదుఅని చెప్పటం. ఈవిధంగా విశ్లేషాన్ని తప్పుగా అర్థంచేసుకొనకుండా అసలు కారణాన్ని తెలియచెయ్యడం ఉణర్‌తల్ అని చెప్పుకుంటారు. అంటే ప్రియుడు బాగావివరించి చెప్పితే ప్రేయసి ప్రణయ రోషంలోంచి బయటపడి నిదానంగా అసలువిషయాన్ని తెలుసుకుంటుం దన్నమాట. ఈవిధంగా ఊడల్ ఉణర్‌తల్ పుణర్‌తల్ అనే మూడూ ప్రేమలోని అవస్థలే. మొదటిపక్షంలో ప్రణయకలహం ప్రేయసికి కలగటంఅయితే ఉణర్తల్ ప్రియుడు చేసి, పుణర్తల్ ఇద్దరూ కలసి చెయ్యటం అవుతుంది. తిరువాయ్‌మొళ్ళిలో (6-1-5) "ఉణర్‌త్తలూడ లుణర్న్దు ఉడన్‌మేయు మడ వన్నజ్ఞాళ్" అన్నచోట కూడా ఇదే మనకి కనబడుతుంది. ప్రియుడు చేసే ఉణర్‌తల్‌నికూడా తాను ఇదివరకు చేసిన ప్రణయకలహాన్నీ తెలియచేసి "నన్ను పరాభవిత్తు" అని ప్రేయసియొక్క ఉణర్‌తల్‌కూడాచెప్పబడింది.

ఉణర్‌దల్ = ఉణర్‌త్తల్" అని విశ్లేషించటం అని అర్థం చెప్తూండగా, కావలసినది ప్రియుడి మాట వినాలి అనే ప్రీతిని గురించి ఉణర్‌తల్ అని ప్రయోగించబడిందని ఒక గొప్పకవిగారివాక్యం. సంశ్లేషం లభించక తాము తత్తరపడేవిధాన్ని ఎంబెరుమానుడికి ఎదురుగానూ, దూతలద్వారానూ తెలియచెయ్యటం. ఉణర్‌తల్ అనటానికి ఇక్కడ ఇదే అర్థం అంటారు. ఇక పుణర్‌తల్ అంటే వీళ్ళకున్నదుఃఖం ఎంబెరుమానుడు బాగుగా తెలిసికొని "మిమ్ములని వదిలితే నాకు మరోగతి ఉన్నదా? నన్ను వేరుగా భావించటం తగునా? మీపాదాలనాశ్రయించినవాడిని కాదా? మీకు దాసుడిని కానా?" అన్నట్లుగా తన అత్యార్తిని తలిపించే మాటలనేకంచెప్పి ద్వారందగ్గర బైట వచ్చి నిలపడటం ముంగిట్లో ప్రవేశించి చిరునవ్వునవ్వుతూ నిలపడటం, దగ్గరకిరాగానే వీళ్ళుకూడా పరవశులైపోయి ఆయనతో కలిసిపోవటం. ఇట్లా ప్రణయరోషం తెలిసేలాగ మాటాడమేమి, వాళ్ళవిశ్లేషబాధని స్వామి మనస్సుకి పట్టిపోయేలాగ తెలపటమేమి, తరువాత ఇష్టప్రకారం



సంశ్లేషించటమేమి ఇటువంటి కార్యాలే గోపస్త్రీలకీ, కృష్ణుడికీ రోజా జరుగుతూంటాయట.

ఈపాశురానికి పెరియవాచ్చాన్పిళ్ళైగారి వ్యాఖ్యానంలో "ఉణర్‌తల్, పుణర్తలై" అన్నప్పుడు "ఇతని లోటుపాట్లను వాళ్ళు చెప్పేటట్లుగాను, ఆయన తరువాత వాడన్నిండినీ తీర్చుకొని వాళ్ళతో కలుస్తాడు" అనిఉన్న వాక్యం అచ్చు ప్రతులన్నింట్లోనూ కనబడుతోంది. ఇది అనన్వితం(అచ్చు తప్పు. తాళపత్రగ్రంథాల్లో శుద్ధపాఠం కనబడుతోంది దానిని గమనించండి అని శ్రీఅణ్ణంగరాచార్యస్వామివారు వ్రాస్తున్నారు. తిరువాయ్‌మొళ్ళి(6-1-5)లో ఉణర్‌త్తలూడలుణర్న్దు" అన్న పాశురానికి ఈడువ్యాఖ్యానంలో భోగప్రకారం మూడువిధాలుగా ఉన్నది, అవి ఏవి అంటే ఊడల్ ఉణర్తల్ పుణర్తల్ ఇవి మూడూ ప్రేమవల్లకలిగేవి అని తిరువళ్ళువార్ కుక్కరళ్‌లో చెప్పబడి ఉన్నది. ఈమూడూ ప్రయోజకాలని తమిళప్రబంధాల్లో చెప్తారు. వీటిలో ఊడల్ అంటే ఎదుటివారితో కలిస్తే కారణం లేకుండా కలిగేది; అదే "నేను లేకుండా స్నానం చేసేవు, నేను లేకుండా పువ్వులని చూసేవు, నీశరీరం పువ్వులవాసన వస్తోంది" వంటి మాటలు అనిపిస్తుంది; ఉణర్‌తల్ అంటే, "నీకోసమే స్నానం చేసేను, నేనేం చేసినా నీకోసమే, " అని పరార్థాన్ని చెప్పటం, "నీ రాకకోసం ఎదురు చూసేను" అన్నట్టుగా చెప్పటం; ఈరెండింటి తరువాత వచ్చేది కలియటం." అని చెప్పబడిఉన్నది. ఇక్కడ ఉదాహరించిన మాటలకి వ్యాఖ్యానం గమనించండి - "ఊడలుణర్‌తల్ పుణర్‌తల్ ఇవై కామమ్ కూడియార్ పెఱ్ఱ పయన్" అని కుఱళ్ పాఠవ కనబడుతుంది. (పుణర్‌చ్చి మకిళ్ళుతల్ అన్న అధికారం(Chapter)లో తొమ్మిదవ సూక్తి ఇది.) ఉణర్‌తల్ అన్నదానికి "నాయకుడు తనతప్పేమీ లేదని చెప్పి నాయకియొక్క ప్రణయకలహాన్ని తీర్చటం" అని అర్థం చెప్పబడింది. పుణర్‌తలై అన్నప్పు డున్న ఐకారం పాదపూరణమే. నీడునిస్త- కృష్ణుడితో కొంతకాలం ప్రణయ కలహమై, కాలంగడవటమూ, కొంతకాలం సంశ్లేషరసావహమై కాలంగడవటం, ఇలావీటన్నింటినీ గోపికాస్త్రీలు ఎప్పటినుంచో అనుభవిస్తున్న వాళ్ళు

ఈ మూడుకార్యాలూ ఈ పాశురంలో మొదటిపాదంలో చెప్పబడ్డా యని చెప్పవచ్చు. అందుచేత ఇక్కడ ఇవి నాలుగుకాదు. అప్పుడు కూడల్ అనేదేమిటి అనివిచారించాలి. ఇదివేరైనదికాదుగదా! అందుచేత ఊడల్కూడల్ అని కలిపి ప్రణయకలహంతో కలిసి ఉన్నది, ప్రణయకలహం చెయ్యటంఅని అర్థంచెప్తారు. కాని ఉణర్తల్తో కలిపి చెప్పటం తగినది. ఊడల్ అన్నప్పుడు కూడల్ అని వేరే చెప్పనక్కరలేదు. ఉణర్తల్ అన్నప్పుడు దేన్ని చెప్పటం అనే ప్రశ్న వస్తుందిగనుక కూడల్ అన్నదాన్ని ఉణర్తల్ అని చెప్పవలసి ఉంటుందిగదా! ఉణర్తల్ అంటే తెలియచెయ్యటమనిగాని, సంశ్లేషాన్ని తెలియచెయ్యటమనిగాని ఏదైనా కావచ్చు. ఈ సంశ్లేషాన్ని తెలియచెయ్యటం అనేది మూడు విధాలుగా ఉంటుంది. తనకిష్టమైనవాడు తన భర్తగా సంశ్లేషిస్తాడని సంశ్లేషప్రశ్నంలో తెలియచెప్పటం ఒకటి. ప్రణయకలహంవల్ల ప్రియుడు దూరమైన తరువాత తిరిగి ప్రేయసికి వాడిమీద తనకున్న ప్రేమచేత అతనువచ్చి తనతో కలుస్తాడా అని సంశ్లేషప్రశ్నం మొదలైనమార్గాలలో తనలోతాను తెలుసుకోవటం మరి ఒకటి. ప్రియుడు, ప్రేయసివద్ద తాను చేసిన కార్యాలన్నింటినీ ఈమెతో సంశ్లేషంకోసమేనని చెప్పుకోవటం మూడవరకమైన ఉణర్తల్. ఇటువంటి ప్రణయకలహం, సంశ్లేషంకలుగుతుందని తెలుసుకొనటం, పునస్సంశ్లేషం వీటిని గోపికలు అనుభవించి ప్రసిద్ధికెక్కేరు.

కూడల్ (సంశ్లేషం) అంటూ మూడవపాదంలో చెప్పిన సంశ్లేషం అనేది మొదటిపాదంలో చెప్పినవాటిలో ఒకటైయుంటే మొదటిపాదాన్ని ఇక్కడ చేర్చటం బాగుంటుంది. ఆయ్చ్చియర్ కూడలై - గోపికల సంశ్లేషం అని చేర్చగలిగేటట్లు ఉన్నా, ఇది బాగుంటుంది. ఈ తిరుమొழ்ழிలో ప్రణయకోపంగురించినది ఏమీ లేదు. అందుచేత ప్రణయకలహంతో కూడిన సంశ్లేషంఅని చెప్పటంకంటే ఉణర్తల్తోకూడినది అనటం స్పష్టంగా ఉంటుంది. ఉణర్తల్ అనేదానికి సంశ్లేషాన్నికలిగించే వార్తని తెలియ చెయ్యటమని అర్థం ఎక్కడా ప్రసిద్ధంకాదు. కాని ఆండాళ్ ఆఅర్థాన్ని తీసుకొని కూడల్-ఉణర్తల్ అనిచెప్పటం తగునాఅని సందేహించనక్కరలేదు. ప్రణయ



కలహం తరువాతనూ, పునస్సంశ్లేషానికి పూర్వమూ, ఉన్న స్థితి అంతా ఉణర్తల్ అనే చెప్పుకోవటం జరుగుతుంది. ఈవిధంగా ప్రియుడు చెప్పిన ఉణర్తల్తోబాటు తానే తెలుసుకోవటంకూడా, దానిలో చేరినదే అవుతుంది. అదేవిధంగా ప్రణయకలహానికి ముందుఉన్న సంశ్లేషం కూడా చెప్పబడినది కావచ్చును. కూడల్ అనేది వివాహానికి ముందు ప్రియుడితో సంశ్లేషం జరగాలి అని ఆశించటం. ఈ పాశురాల్లో చెప్పినదానికి తగినట్లుండటంకోసం కూడల్ఊడల్ - సంశ్లేషం,ప్రణయకలహం అని చెప్పబడలేదు. తిరువాయ్ మొழ்ழிలోకూడా "ఉణర్తలూడల్" అన్నప్పుడు "ఊడల్ఉణర్తల్" అని ఎట్లా అన్వయం చెప్పుతామో అదేవిధంగా ఇక్కడకూడా అన్వయం చెప్పుకోవాలి. కూడల్ అనేది ప్రణయకలహానికి తరువాత సంభవించేది అని వివరించటానికి కూడా ఊడల్కూడల్ అని చేర్చి చెప్పవచ్చును.

కూడల్, ఊడల్ ఉణర్తల్, పుణర్తల్ అని ఈ అవస్థలని నాలుగుగా చెప్పుకొనటం కూడా యుక్తమే. ఊడల్ మొదలైనవి మూడేనని వేరుస్థలాల్లో ప్రసిద్ధం. అయినా, ఊడల్-ప్రణయకలహానికి ముందుఉన్న సంశ్లేషాన్ని చేర్చి చెప్పటమే బాగుంటుంది.

నిఱై పుకழ் ఆయ్చ్చియర్ - గోపికాస్త్రీలు మనందరిలాగ తినటం, బట్టకట్టటం, సంతోషంగా తిరగటంచేస్తూ ఎన్నోదినాలు గడపకుండా మూడు వేళలా ఎల్లప్పుడూ భగవద్విషయచింతనే చేస్తూ కాలం గడుపుతున్నారు అనే కారణం చేత వాళ్ళకీర్తి బాగా ఉన్నది అని సామాన్యమైన అర్థం చెప్పవచ్చు. కాని ఈసందర్భంగా ఎంబార్ ఇలా సాయించేవారట - "ఆయ్చ్చియర్క్కు నిఱైపుకழாவతు, కృష్ణనై ఇన్నాళ్ నాలుపట్టిని కొణ్డాళ్, ఇన్నాళ్ పత్తుపట్టిని కొణ్డాళ్ ఎన్నుమ్ పుకళుమ్ - గోపికాస్త్రీలకి పూర్ణమైన కీర్తి గొప్పతనం ఏమిటంటే, ఫలానా గోపికకోసం కృష్ణుడు నాలుగురోజులు ఉపవాసం చేసేడు, ఫలానా గోపికకోసం కృష్ణుడు పదిరోజులు ఉపవాసం చేసేడే అనే గొప్పతనమే అని చెప్పుకోవాలి" దీనికర్థం ఏమిటంటే, "కూర్మణ్ణుపోల్ పనిక్కూతలెయ్ది కూశినడుఙ్గి యమునైయాఱ్ఱిల్ వార్మణఱ్కున్ఱిల్ పులర నిన్ఱేన్ వాశుతేవా! ఉన్వరవు పార్త్తే" అని

చెప్పినవిధంగా కృష్ణుడు ఎప్పుడువస్తాడా అని ఎదురుచూస్తుంటారు ఎంతోమంది. ఈయన ఇట్లా ఎంతోమంది గోపికలు తనకోసం ఎదురుచూసే లాగ చేసి, తనకిష్టమైన ఒక గోపికతో కలిసిఉండి గడుపుతూంటాడు. అప్పుడు అతనికోసం ఎదురుచూస్తున్న గోపికలు "ఇంక నాచేతికి చిక్కిననాడు నా కోపం తీర్చుకుంటాను" అన్నట్లుగా "ఇక ఆ కృష్ణుడు ఇక్కడికి వస్తే అతనికి ముఖం చూపించటం, మాటలాడటం మొదలైనవి చెయ్యం" అని అనుకొని, విపరీతమైన కోపం తెచ్చుకుంటారు. తరువాత, తనకి లేకపోయినప్పుడు ఒకనాడు కృష్ణుడు అంతులేని ప్రీతికలిగినవాడిలాగ ఆడుతూపాడుతూ వాళ్ళముందు వచ్చి నిలుచుంటాడు. అప్పుడు వాళ్ళు ముందు అనుకున్నట్టు అతనివేసు చూడకుండా అతనితో మాటాడకుండా ఉంటారు. ఈయన కళ్ళనీళ్ళుపెట్టుకొని ఏడుపుమొదలుపెట్టటం, కాళ్ళకి మొక్కటం, చేస్తూ, తిండీ తిప్పలు లేక నిద్రకూడా మానేసిఎన్నాళ్ళో వాళ్ళ ఇల్లు వదలకుండా ఎదరగాఉన్న ఒక తిన్నెమీద పడిఉంటాడు. ఇలా నాలుగురోజులుఉపవాసం తరువాత ఒకగోపిక మనస్సు కరిగి తనముఖం చూపిస్తుంది. మరొకగోపిక అప్పుడుకూడా కోపం తగ్గక ఈయన ఎనిమిదిరోజులు ఉపవాసం ఉన్న తరువాత ఆయనతో ముఖంచూపి మాటాడుతుంది. మరొకామె అప్పటికీ ప్రణయరోషం తగ్గక, పదిరోజులు ఆయనచేత ఉపవాసం చేయించినతరువాతే ముఖం చూపిస్తుంది. ఈవిధంగా ఎన్నెన్నిరోజులో ఉపవాసాలు చేసినా ఆగోపికాస్త్రీల ప్రసన్నతకావాలనుకొనటం వాళ్ళకున్న దేహగుణాలు, ఆత్మగుణాలు మొదలైన వైలక్షణ్యంవల్లనే. దీనివల్ల వాళ్ళకీర్తి గొప్పతనాన్ని పొందిందన్నమాట.

నీడునిన్ఱ నిఱైపుకழ் - ప్రణయకలహంలో ఉన్న గోపికాస్త్రీలు కొంచెం కూడా కృష్ణుడికి అవకాశాన్నివ్వక చాలాసేపు అందులోనే ఉండిపోయినారు. "నాలుగు ఉపవాసాలు" చేయించినామె, పదిరోజులు ఉపవాసం చేయించి నామె అనిచెప్పబడే గోపికాస్త్రీలు ఎంతోమంది ఉంటారని అంటారు. అంటే ఆయనని ఈమెకోసం ఎదురుచూస్తూ భోజనమైనా చెయ్యకుండా నాలుగు రోజులపాటుంచినది ఒకామె, ఆమెలాంటివాళ్ళు ఆమెకంటె ఎక్కువగా



కృష్ణుడిచేత ఎదురుచూడబడుతున్న వాళ్ళూ ఎంతోమంది అని అర్థమన్నమాట. ఇట్లా ప్రతిదానిలోనూ ఎక్కువగా ఉండటం ఇక్కడ చెప్పబడు తున్నది. నిన్ఱు అనికూడాపాఠముండడం గమనీయం. నిఱైపుకழ் అన్న క్రియా-విశేషణంలో నిఱై అనేదానికి పూర్ణత్వం అనే అర్థం చెప్పుకొనకుండా నింపటం అని అర్థంచెప్పవచ్చు. అప్పుడు తిరిగికలియటం అనే క్రియార్థం కుదురు తుంది. అలా కాకుండా పుణర్తలై అన్నదానిలోని ఐకారం అవ్యయంగా చేసి, పుణర్తల్ అన్నదానికి సంశ్లేషాల్లో అని అర్థంచెప్పటం, నిఱై పుకழ் అన్నదానికి నిండైనకీర్తి అని అర్థంచెప్పటంచేత నీడునిన్ఱుఅన్న క్రియాప్రత్యయానికి అన్వయంలేకపోవటాన్ని గమనించి నీడునిన్ఱ అన్నపాఠమే అంగీకరించి ఆ పాఠాన్ని వదలివేయటంకూడా ఉచితంకాదు. నిన్ఱ అనే పాఠం అయినప్పటికీ, సంశ్లేషాన్నికలిగించటం అనేదాన్ని పూర్తిచేస్తున్న అనేఅర్థంలో పుణర్తలై నిఱైకిన్ఱ అని అన్వయం చెప్పుకుందికి అడ్డేమీలేదు.

ఈవిధంగా పరిశీలించినప్పుడు మున్ అన్నపదం కూడా చక్కగా సరిపోతుంది. గోదాదేవియే చెప్పేటప్పుడు మున్కూఱియ అని చెప్పటం ఎలా కుదురుతుంది అనే శంకకి వ్యాఖ్యాతలు మున్ అనేదాన్ని రెండో పాదంలో నీడునిన్ఱు అన్నపదాలతో చేరుస్తారు. కాని అది స్వారస్యంలేనిదే అవుతుంది. కనుక ఊడల్, కూడల్, ఉణర్తల్, పుణర్తల్ అన్న గోపికల చేష్టలలో ఊడల్నివదిలివేసి, కలవటాన్నే మొట్టమొదటిదిగా గోదాదేవి చెప్పిన పాశురమనిఅర్థం గ్రాహ్యం. వివాహంచేసికొని కలసివస్తున్నపుడే ప్రణయ కలహానికి అవకాశమున్నది. ఇప్పుడు వివాహంచేసికొనటానికి పూర్వమే సంశ్లేషాన్ని ఆశించటం తగును. అందుచేత దాన్నే ముందు చెప్పినదని భావం. "మున్ కూడలై" అని చేర్చి ఊడల్కి ముందరే ఉన్న కూడల్ అని చెప్పుకున్నా చెప్పవచ్చు.

ఈతిరుమొழ்ழికూడా గోపికలమాటలకే అనువాదమంటారు. గోపికల లాగనే ఆణ్డాళ్కూడా సంశ్లేషం కలగాలనికోరుతున్నప్పుడు ఆ సంశ్లేషం అనే దాన్ని ఒకవ్యక్తిగా భావించి, దానితో తాను చెప్పేటటువంటి మాటలే ఇవి కావచ్చు. వెనుకటి రెండు తిరుమొழ்ழులలాగ మొత్తం గోపికలమాటలుకావు.

అందుచేత, ఎన్కైపఱ్ఱి, నమ్ తెరువిన్ నడువే అన్నచోట్ల ఎన్, నమ్ అన్నవి ఆణ్డాళ్నే చెప్తాయి. అలాంటప్పుడు ఆయ్చ్చిమార్కళుమ్, ఆయరుమ్, అణియాయ్చ్చియర్ శిన్దైయుళ్ మొదలైనప్రయోగాలలో నాఙ్గళుమ్-మేము, ఎఙ్గళ్-మాయొక్క అంటూ ప్రత్యేకంగా అనకపోయినా, అవి ఆండాళ్మాటలనీ, గోపికలమాటలుకావనీ చెప్పటమే స్వరసమౌతుంది.

ఇక్కడ ***కోழై కూవియ*** అనకుండా ***కుழ్లక్కోழై కూవియ*** అనటం వల్ల ఈమె తన కేశపాశబంధంతో ఆస్వామిని కలిసేలా చేయించగలదు అని రసోక్తిగా కటాక్షించేరు పెరియవాచ్చాన్పిళ్ళైగారు. ఈ పదిపాశురాలనీ అభ్యసించినవారికి పాపంలేదు అనటం భగవత్సంశ్లేషంకావాలనిఆండాళ్ సంశ్లేషాన్ని కల్పించమని ప్రార్థించి శ్రమ పడవలసినంతటి పాపం ఉండదు అని చెప్తున్నదన్నమాట. ఈపాశురాలని అధ్యయనం చెయ్యటమే తడవుగా అనాయాసంగా భగవత్సంశ్లేషం లభిస్తుంది అని భావం.

నాచ్చియార్ తిరుమొழ్ఝి నాలుగవ తిరుమొழ్ఝి సమాప్తం.